తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
కరీంనగర్ - నిజామాబాద్
రాజన్న సిరిసిల్ల | కామారెడ్డి
పెద్దపల్లి | జగిత్యాల
మంగళవారం
11 ఆగస్ట్ 2026
Follow :



# హన్మాజీపేటను క్రీడాకారుల ఖిల్లాగా తీర్చిదిద్దాలి

## చెన్నమనేని వికాస్

**వేములవాడ రూరల్ (జనం సాక్షి) :** హన్మాజీపేట గ్రామం రాబోయే రోజుల్లో క్రీడాకారుల ఖిల్లాగా రూపాంతరం చెందాలని ప్రతిమ ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ చెన్నమనేని వికాస్ ఆకాంక్షించారు. సోమవారం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'ఓపెన్ జిమ్'ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత నిరంతరం ఫిట్‌గా ఉంటూ 'ఖేలో ఇండియా', 'టార్గెట్ ఒలింపిక్స్' పథకాలను సద్వినియోగం చేసుకొని పతకాలు సాధించాలని పిలుపునిచ్చారు. గ్రామీణ యువత ప్రోత్సాహానికి ప్రతిమ ఫౌండేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ పాలకవర్గం, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

# తిట్టిందన్న కక్షతో యజమాని ఘాతుకం

**మద్యంలో నైట్రాబ్ పొడి కలిపి కార్మికుడిని హత్య చేసినట్లు పోలీసుల వెల్లడి**
**మృతుడి భార్యతో పాటు ఇతరులపై నింద మోపేందుకు నిందితుడి ప్రయత్నం**

**సిరిసిల్ల టౌన్, ఆగస్టు 10 (జనం సాక్షి):** సిరిసిల్ల పట్టణంలోని రగుడు శివారులో మూడు రోజుల క్రితం అనుమానాస్పదంగా మృతి చెందిన వెంగళ వెంకటేశం హత్యకు గురైనట్లు పోలీసులు వెల్లడించారు. ఈ కేసులో నిందితుడు కుసుమ గణేష్‌ను అదుపులోకి తీసుకుని సోమవారం మీడియా ఎదుట హాజరుపరిచారు. ఈ సందర్భంగా డీఎస్పీ నాగేంద్రచారి కేసు వివరాలను వెల్లడించారు.

స్థానిక బీవై నగర్‌కు చెందిన కుసుమ గణేష్ వద్ద వెంగళ వెంకటేశం పనిచేసేవాడు. వెంకటేశం తరచూ విధులకు గైర్హాజరవుతుండటంతో గణేష్ పలుమార్లు అతడిని మందలించేవాడు. ఈ విషయంలో వెంకటేశం భార్య సులోచన కూడా గణేష్‌ను నిలదీస్తూ తిట్టేదని పోలీసులు తెలిపారు. దీంతో వెంకటేశం కుటుంబంపై కక్ష పెంచుకున్న గణేష్.. అతడిని ఎలాగైనా హతమార్చాలని నిర్ణయించుకున్నట్లు విచారణలో వెల్లడైనట్లు డీఎస్పీ తెలిపారు.

**మద్యంలో నైట్రాబ్ పొడి కలిపి..**

ఈ నెల 6న ఉదయం గతంలో కొనుగోలు చేసి ఇంట్లో ఉంచుకున్న ఎంసీ విస్కీ క్వార్టర్ బాటిల్‌లో తన వద్ద ఉన్న నైట్రాబ్ పొడిని కలిపినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం



వెంకటేశానికి ఫోన్ చేసి మద్యం తాగేందుకు రమ్మని పిలిచాడు. నైట్రాబ్ కలిపిన ఎంసీ విస్కీ క్వార్టర్ బాటిల్‌తో పాటు మరో మెన్షన్ హౌస్ క్వార్టర్ బాటిల్, రెండు వాటర్ ప్యాకెట్లను తీసుకుని ఆర్టీసీ బస్సులో రగుడు శివారుకు వెళ్లాడు.

అక్కడ వెంకటేశంతో నైట్రాబ్ కలిపిన మద్యాన్ని తాగించినట్లు పోలీసులు తెలిపారు. కొద్దిసేపటి తర్వాత వెంకటేశం కిందపడిపోగా, అతడు మృతి చెందాడని భావించిన గణేష్ అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు డీఎస్పీ వివరించారు.

**ఇతరులపై నింద మోపేందుకు ప్రయత్నం**

హత్య విషయం బయటపడకుండా ఉండేందుకు నిందను ఇతరులపైకి మళ్లించేందుకు గణేష్ ప్రయత్నించినట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం వెలుగులోకి వచ్చిందన్నారు. నిందితుడి వద్ద నుంచి ఒక మోటార్‌సైకిల్, రెండు మొబైల్ ఫోన్లు, ఒక నైట్రాబ్ ప్యాకెట్, ఎంసీ విస్కీ క్వార్టర్ బాటిల్, ఒక క్లాత్, క్యాప్‌ను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. కేసుపై దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు

---

## బెదిరింపులు, అక్రమ వసూళ్లకు పాల్పడితే

# కఠిన చర్యలు తప్పవు

**నిందుతుల వద్ద రూ.50,000 నగదు, రెండు మొబైల్ ఫోన్స్ స్వాధీనం**

**వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే**


**వేములవాడ, ఆగస్టు 10 (జనం సాక్షి)**

బెదిరింపులు, అక్రమ వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవనీ జిల్లా ఎస్పీ మహేష్ బీ గీతే అన్నారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కోనరావుపేట్ మండలశీలోని ఎగ్లెస్పూర్ గ్రామానికి చెందిన దండు వినోద్ కుమార్, వేములవాడ పట్టణంలోని నాంపల్లి గ్రామానికి చెందిన పెద్దగారి అమరగొండ అజయ్ అనే ఇద్దరు వ్యక్తులు కలిసి వ్యాపారం నిర్వహించే వ్యక్తులను లక్ష్యంగా చేసుకొని వారిని బెదిరించి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేయాలని నిర్ణయించుకున్నారు. అపథకంలో భాగంగా వేములవాడ పట్టణ పరిధిలోని అగ్రహారం గ్రామ శివారులో స్టోన్ క్రషర్ నిర్వహిస్తున్న నీలం గురవయ్యను నిందితులు లక్ష్యంగా చేసుకొని ఈ నెల 9 వ తేదీన దండు వినోద్ తన మొబైల్ ఫోన్ నంబర్ నుండి నీలం గురవయ్యకు ఫోన్ చేసి, క్రషర్‌కు సంబంధించిన లైసెన్స్, భూమికి సంబంధించిన విషయాలపై అసత్య ప్రచారం చేస్తామని ఫోన్ ద్వారా బెదిరించగా, గురవయ్య అగ్రహారం ప్రాంతానికి రాగా, నిందితులు ఇద్దరూ అతడిని అగ్రహారం గుట్టల వద్దకు తీసుకెళ్లి, అతని క్రషర్, వ్యాపారానికి సంబంధించి అసత్య ప్రచారాలు చేయకుండా ఉండాలంటే రూ.20,00,000/- ఇవ్వాలని ఇవ్వకపోతే వ్యాపారాన్ని దెబ్బ తీస్తానని



బెదిరించగా,దీంతో భయపడిన బాధితుడు ఎ టి ఎం కు వెళ్లి రూ.50,000/- నగదు తీసుకుని వచ్చి వేములవాడలోని అగ్రహారం టీ పాయింట్ వద్ద నిందితులకు ఇవ్వడం జరిగింది.

వేములవాడ కి చెందిన బండ మల్లేశం అను రైస్ మిల్లర్ పై కూడా బెదిరింపులకు పాల్పడి రూ. 10,00,000/- డిమాండ్ చేయగా బాధితుల ఫిర్యాదు మేరకు వేములవాడ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా నిందుతులని నిన్నటి ఆదివారం రాత్రి సాయినగర్ లో అదుపులోకి తీసుకొని వారి వద్ద 50,000/- రూపాయల నగదు, రెండు మొబైల్ ఫోన్స్ స్వాధీనం చేసుకొని రిమాండ్ కు తరలించామన్నారు.



The Singareni Collieries Company Limited
(A GOVERNMENT COMPANY)
Group Vocational Training Centre, Ramagundam-I

Ref.No.RG.I/GVTC/118/2026/1105 Date: 09.07.2026

GM, RG-II/RG-III Area.

Sub: Selection of Foreman Mechanical to work as Instructor at GVTC,RG.I - Reg.
Ref No. (1) Approved Note RG.I/GVTC/2026/6402, Dt: 21.04.2026
(2) RG.I/GVTC/118/2026/1100, Date: 07.07.2026
-oOo-

With reference to the above subject. Please find enclosed herewith the list of applicants who have expressed their willingness to work as instructor at GVTC, RG-I and it is proposed to conduct a interview on 20.07.2026 at 3PM after duty hours at GVTC, RG-I area by a committee formed for the same.

In view of the above, it is requested to advise the concern authority to direct the candidates to attend the interview on 20.07.2026 at about 3PM after duty hours in the office of GVTC, RG-I along with original documents of qualification, experience and identity card.

GENERAL MANAGER
RAMAGUNDAM AREA-I.

Encl: As above.

Cc to:
GM (HRD), Corp.
GM (PER) IR&PM, Corp.
SO to GM & Agent GVTC, RG-I.
PO, OCP-I, RG.III / PO, OC-III, RG.II.
DGM (E&M), CHP, OC-III, RG.II.
PO, GDK CM (2,2A&5), RG.I.
DGM (E&M), AWS, CSP-I, RG-I.
Mine Manager, GDK 2&2A, 11 INC, RG.I.

# అర్‌జీ-1ఎంవీటీసీ ఇంటర్వ్యూలో సీనియారిటికి తిలోదకాలు

**సీనియర్‌లను కాదని జూనియర్‌కు పట్టం కట్టే ప్రయత్నం..?**

**గోదావరిఖని, జనంసాక్షి :** మైనింగ్ ఇన్‌స్పెక్టర్ గైడ్‌లైన్స్ ప్రకారం ఎంవీటీసీ ట్రైనింగ్ సెంటర్‌లో మైనింగ్,మెకానికల్,ఎలక్ట్రికల్ అనుభవం కలిగిన సూపర్వైజర్ క్యాడర్‌కు అవకాశం ఇవ్వాల్సి ఉందని మార్గదర్శకాలు ఇవ్వడంతో సింగరేణి ఆర్‌జీ-1ఎంవీటీసీలో కూడా పనిచేయడానికి గత నెల 20న ఇంటర్వ్యూలు నిర్వహించారు. మెకానికల్ విభాగంలో ఒకరికి అవకాశం ఉంది,దానిని సీనియారిటీ ప్రకారం కాకుండా సంఘ పెద్ద నాయకులు, ఓ అధికారి చెప్పిన వ్యక్తికి కట్టబెట్టేందుకు రంగం సిద్ధం అయినట్టు తెలిసింది.ఈ విషయంలో సీనియర్ సూపర్వైజర్‌లను కాదని, పదేళ్లు కూడా నిండని ఒక జూనియర్ సూపర్వైజర్ కార్మికునికి ఇవ్వడం అన్యాయమని,దీనిపై డైరెక్టర్ (పా) దృష్టి పెట్టి న్యాయం చేయాలని సూపర్‌వైజర్ ఉద్యోగులు కోరుతున్నారు.

# ఘనంగా నల్లపోచమ్మ బోనాల మహోత్సవం

- మారంపల్లి పరివారం ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహణ
- పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలు, యువత, భక్తులు



**ఇందల్వాయి, ఆగస్టు 10 (జనంసాక్షి):** ఇందల్వాయి గ్రామంలో మారంపల్లి పరివారం ఆధ్వర్యంలో శ్రీ నల్లపోచమ్మ తల్లి బోనాల మహోత్సవాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామ పురవీధుల నుంచి మహిళలు, భక్తులు బోనాలతో ఊరేగింపుగా నల్లపోచమ్మ ఆలయానికి చేరుకున్నారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి ఒడి బియ్యంతో పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి కృపాకటాక్షాలతో గ్రామంలో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రార్థించారు. బోనాల సందర్భంగా అమ్మవారి నామస్మరణతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో మారంపల్లి పరివారం కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామ పెద్దలు, యువత, మహిళలు, గంగపుత్ర సంఘం సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బోనాల మహోత్సవం ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించడంతో నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు, భక్తులకు మారంపల్లి పరివారం కృతజ్ఞతలు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులు ఇందల్వాయి గ్రామ ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆరోగ్యం, ఐశ్వర్యం, శాంతి వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

# మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికుల నిరసన

### కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని డిమాండ్



మెట్‌పల్లి, ఆగస్టు 10 (జనంసాక్షి): మెట్‌పల్లి మున్సిపల్ కార్యాలయం ఎదుట కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో సోమవారం కార్మికులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మిక సంఘం ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎం.డి. ఉస్మాన్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాన్ని రూ.26 వేలకు పెంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు. జీవో ఎంఎస్ నంబర్ 14 ప్రకారం వేతనాలు అమలు చేయాలని కోరారు. 2021 జూన్ 11న జారీ చేసిన జీవో ప్రకారం గత ప్రభుత్వం అన్‌స్కిల్డ్ కార్మికులకు రూ.16,600, స్కిల్డ్ కార్మికులకు రూ.20,500, హైస్కిల్డ్ కార్మికులకు రూ.22,750 వేతనాలు నిర్ణయించిందన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం వేతనాలను తగ్గిస్తూ 2026 జూలై 12న జీవో ఆర్‌టీ నంబర్ 1181 జారీ చేసిందని ఆరోపించారు. ఏ కార్మిక చట్టంలోనూ వేతనాలను తగ్గించే నిబంధన లేదని, వెంటనే జీవో 1181ను ఉపసంహరించుకుని గతంలో అమలులో ఉన్న వేతనాలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులందరికీ శాశ్వత ఉద్యోగాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో మెట్‌పల్లి మున్సిపల్ కార్మిక సంఘం అధ్యక్షుడు లంక శ్రీకాంత్, జిల్లా అధ్యక్షుడు బర్ల లక్ష్మణ్, యమ నరసయ్య, మధురమ్మ, లక్ష్మి, బర్ల నరసయ్య, వాజిద్, గంగాధర్, నిజాం తదితర కార్మికులు పాల్గొన్నారు.

# 12 ఏళ్ల తెలంగాణలో సిరికొండకు స్మశాన వాటిక ఎప్పుడు?

- ఎన్నికల హామీలకే పరిమితమైన నాయకులు
- దొండ్లవాగు దాటుతూ అంత్యక్రియలు.. కట్టెల తరలింపునకు జేసీబీ సాయం



**సిరికొండ, ఆగస్టు 10 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 ఏళ్లు గడిచినా సిరికొండ మండల కేంద్రానికి ఇప్పటికీ శాశ్వత స్మశాన వాటిక లేకపోవడం ప్రజల దుస్థితికి అద్దం పడుతోంది. ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ స్మశాన వాటిక ఏర్పాటు చేస్తామని హామీలు ఇవ్వడం, ఎన్నికలు ముగిసిన తర్వాత ఆ విషయాన్ని పట్టించుకోకపోవడం ఏళ్లుగా కొనసాగుతోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం గ్రామంలో ఎవరైనా మృతి చెందితే అంత్యక్రియల కోసం దొండ్లవాగు పరిసర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. వర్షాకాలంలో వాగులో నీటి ప్రవాహం పెరిగితే మృతదేహాన్ని తరలించడం కుటుంబ సభ్యులు, బంధువులకు తీవ్ర ఇబ్బందిగా మారుతోంది. పారుతున్న నీటిలో వాగు దాటి చివరి మజిలీకి చేరాల్సిన పరిస్థితి నెలకొంది. అంత్యక్రియల కోసం మృతదేహాన్ని తరలించడంతోపాటు చితి పేర్చేందుకు అవసరమైన కట్టెలను సైతం ట్రాక్టర్‌లో తరలించి, జేసీబీ సాయంతో వాగు దాటించాల్సి వస్తోందని గ్రామస్థులు తెలిపారు. మృతుడికి చివరి చూపు చూసేందుకు వచ్చే వృద్ధులు, మహిళలు, చిన్నారులు, బంధువులు సైతం వాగు దాటుతూ అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. నీటి ప్రవాహం అధికంగా ఉన్న సమయంలో ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించేందుకు ప్రతి గ్రామానికీ స్మశాన వాటిక అవసరమని, అయితే సిరికొండలో మాత్రం ఆఖరి మజిలీకి వెళ్లేందుకు కూడా ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాపోయారు. తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి సిరికొండలో స్మశాన వాటిక ఏర్పాటు అంశం ఎన్నికల హామీగానే మిగిలిపోయిందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా రాజకీయాలకు అతీతంగా సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. మండల కేంద్రంలో అనువైన స్థలాన్ని గుర్తించి శాశ్వత స్మశాన వాటిక నిర్మించడంతోపాటు అక్కడికి సురక్షితమైన రహదారి, విద్యుత్, నీటి సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. చివరి మజిలీ కోసం వాగులు దాటాల్సిన దుస్థితికి ముగింపు పలకాలని, ఇక హామీలకే పరిమితం కాకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# జన్యు వ్యాధిగ్రస్త చిన్నారులకు జాగిర్యాల్ యువత అండ

### ఎస్ఎంఏపై అవగాహనకు గచ్చిబౌలి స్టేడియంలో 10 కిలోమీటర్ల రన్




**భీంగల్ రూరల్, ఆగస్టు 10 (జనంసాక్షి):** స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ (ఎస్ఎంఏ) వంటి అరుదైన జన్యు సంబంధిత వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించడంతోపాటు, బాధిత చిన్నారులకు అండగా నిలిచేందుకు జాగిర్యాల్ గ్రామానికి చెందిన మహేష్, శేఖర్, రాకేష్ గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన ఎస్ఎంఏ అవేర్‌నెస్ 10 కిలోమీటర్ల రన్‌లో పాల్గొన్నారు. ఎస్ఎంఏతో బాధపడుతున్న చిన్నారుల చికిత్సకు వినియోగించే జోల్జెన్స్‌మా ఇంజెక్షన్ ఖరీదు సుమారు రూ.16 కోట్లు ఉండటంతో బాధిత కుటుంబాలకు ఆర్థికంగా చేయూతనందించేందుకు కార్యక్రమం ద్వారా చేపట్టిన నిధుల సేకరణలో వారు భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా గడాల మహేష్ మాట్లాడుతూ ఎస్ఎంఏ జన్యుపరమైన వ్యాధి కావడంతో పెళ్లికి ముందు, గర్భధారణకు ముందే ఎస్ఎంఏ క్యారియర్ జీన్ స్క్రీనింగ్, జన్యు కౌన్సెలింగ్ చేయించుకోవడం ద్వారా వ్యాధి ముప్పును ముందుగానే అంచనా వేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజలు జన్యు సంబంధిత వ్యాధులపై అవగాహన పెంచుకుని, అవసరమైనప్పుడు వైద్య నిపుణుల సలహా తీసుకోవాలని సూచించారు. ఎస్ఎంఏతో బాధపడుతున్న చిన్నారుల ప్రాణాలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయం అందించాలని, అరుదైన జన్యు వ్యాధులపై అవగాహన కల్పించడం అందరి బాధ్యత అని మహేష్ కోరారు.

# కార్మిక, కర్షక పోరాటాలతో కేంద్రం మెడలు వంచుదాం

- క్విట్ ఇండియా స్ఫూర్తితో హక్కుల కోసం పోరాడాలి.
- టీయుసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. రమేష్



**సిరికొండ, ఆగస్టు 10 (జనంసాక్షి):** కార్మిక, కర్షక పోరాటాలతో కేంద్ర ప్రభుత్వ మెడలు వంచుదామని, క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ప్రజల హక్కుల కోసం పోరాడాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయుసీఐ) జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. రమేష్ పిలుపునిచ్చారు. ఎస్‌కేఎం, కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో సోమవారం దేశవ్యాప్తంగా చేపట్టిన జైల్ భరో కార్యక్రమంలో భాగంగా సిరికొండలోని అంగడి బజార్ నుంచి తెలంగాణ చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం స్వదేశీ కార్పొరేట్ సంస్థలు, విదేశీ బహుళజాతి కంపెనీలకు అనుకూలంగా ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ఆరోపించారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల పేరుతో వ్యవసాయ రంగాన్ని దెబ్బతీస్తూ రైతులను నష్టపరిచే చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. విదేశీ వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులతో దేశీయ రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర లభించక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. విదేశీ కంపెనీలకు అనుకూలంగా కార్మిక చట్టాల్లో మార్పులు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడం ద్వారా కార్మికుల హక్కులను హరిస్తున్నారని ఆరోపించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తూ కొత్త పేర్లతో పథకాలను తీసుకురావడం ద్వారా వ్యవసాయ కార్మికుల సంక్షేమం నుంచి ప్రభుత్వం తప్పుకునే ప్రయత్నం చేస్తోందన్నారు. విద్యుత్ రంగంలో కొత్త చట్టాల ద్వారా రైతులు, సామాన్య ప్రజలపై అదనపు భారాలు మోపేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని విమర్శించారు. అటవీ పరిరక్షణ పేరుతో చేపడుతున్న మార్పుల వల్ల పోడు భూములపై ఆధారపడుతున్న గిరిజనులకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఐక్యమై పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహించాలని రమేష్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. బాబన్న, కార్యదర్శి ఆర్. దామోదర్, కోశాధికారి ఎం. లింబాద్రి, ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ. రమేష్, కార్యదర్శి ఎం. సాయిరెడ్డి, ఉపాధ్యక్షుడు బి. కిశోర్, కోశాధికారి ఎస్. కిశోర్, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ మండల నాయకులు గ్యామ గంగారాం, పి. ఎల్లయ్య, జి. రాజు, ఎం. పందరి, బి. సర్పంచ్, పీవైఎల్ రాష్ట్ర నాయకులు కె. ఆశిష్ తదితరులు పాల్గొన్నారు.

# నాడు పవర్ ప్రజెంటేషన్‌లో చెప్పింది ఒకటి.. నేడు జరుగుతున్నది మరోటి

- రాజన్న ఆలయ అభివృద్ధి పనులపై బీజేపీ రాష్ట్ర నాయకుడు ప్రతాప రామకృష్ణ
- ప్రజెంటేషన్ ప్రకారమే పనులు చేపట్టాలని డిమాండ్



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 10 (జనంసాక్షి):**వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనుల్లో భాగంగా గతంలో ఎండోమెంట్ అధికారులు, ప్రభుత్వ విప్ ఆధ్వర్యంలో నిర్వహించిన పవర్ ప్రజెంటేషన్‌లో చెప్పిన అంశాలకు విరుద్ధంగా ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రతాప రామకృష్ణ ఆరోపించారు. సోమవారం బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజన్న ఆలయ అభివృద్ధికి తమ పార్టీ మొదటి నుంచీ సహకరిస్తోందని, అయితే భక్తుల విశ్వాసాలను పరిగణనలోకి తీసుకోకుండా పనులు చేపడితే అభ్యంతరం వ్యక్తం చేస్తామని అన్నారు. ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రమే పరిశీలించాలనే నిబంధన ఏమిటని ప్రశ్నించారు. పనులను పరిశీలించేందుకు విలేకరులు, రాజకీయ నాయకులకు ఎందుకు అనుమతి ఇవ్వడం లేదని నిలదీశారు. శృంగేరి పీఠాధిపతి సూచన మేరకు కోటిలింగాలను శాశ్వతంగా తొలగిస్తామని చెప్పడంతో తాము అంగీకరించామని, అయితే ఇప్పటి వరకు వాటిని ఎక్కడ ఉంచారో తెలియదన్నారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా కాలభైరవస్వామి, హనుమాన్ ఆలయాలను తొలగించినప్పటికీ తాము అభ్యంతరం వ్యక్తం చేయలేదన్నారు. గత మహాశివరాత్రి జాతర నాటికి భక్తులకు దర్శనం కల్పిస్తామని చెప్పినా, పనులు సకాలంలో పూర్తికాకపోవడంతో దర్శనాలు కల్పించలేదని విమర్శించారు. వేములవాడ పట్టణ అభివృద్ధి సంస్థ (వీటీడీఏ) వైస్ చైర్మన్‌గా ఉన్న జిల్లా కలెక్టర్, ఆలయ ఈవోలను అభివృద్ధి పనులపై ప్రశ్నిస్తే తమకు తెలియదని చెప్పడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఆలయ విస్తరణ పేరుతో పట్టణంలోని ప్రధాన కూడలిలో రాకపోకలు నిలిచిపోయాయని, నిర్మాణాల కారణంగా ప్రభావితమవుతున్న వారికి పరిహారంపై ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు స్పష్టత లేదన్నారు. రోడ్లపై ఉన్న మతపరమైన నిర్మాణాల విషయంలో న్యాయస్థానాల మార్గదర్శకాలను ప్రస్తావిస్తూ, ఇక్కడ మాత్రం రోడ్డుపైకి ఆలయాన్ని విస్తరిస్తున్నారని ఆరోపించారు. జాతర గ్రౌండ్‌తోపాటు పట్టణంలోని ప్రధాన కూడలిలో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అన్నారు. రాజన్న ఆలయ గర్భాలయాన్ని కదిలించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇందుకోసం శృంగేరి పీఠాధిపతిని సంప్రదించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తమకు సమాచారం ఉందన్నారు. రాష్ట్రంలోని ఇతర దేవాలయాలను రాతి కట్టడాలతో అభివృద్ధి చేస్తుండగా వేములవాడ ఆలయంలో సిమెంట్ నిర్మాణాలు చేపడుతున్నారని విమర్శించారు. గోపురం ఎత్తు పెంచడం వల్ల గర్భాలయ శిఖరం ఎత్తు పెంచుతున్నట్లు అధికారులు చెబుతున్నారని, ఈ అంశం ఇంజినీరింగ్ అధికారులకు ముందుగా తెలియదా అని ప్రశ్నించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్నప్పటికీ ఆలయ అభివృద్ధి పనుల్లో సరైన ప్రణాళిక లేదని ఆరోపించారు. పాత వేములవాడ రూపురేఖలను మార్చే క్రమంలో ప్రజా ప్రయోజనాల కంటే వ్యక్తిగత ప్రతిష్ఠకు ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించారు. ఆలయ నిర్మాణంతో సంబంధం ఉన్న రాజరాజ నరేంద్రుడు, ఆది శంకరాచార్యుల విగ్రహాలు ఆలయంలో ఏర్పాటు చేయలేదన్నారు. అభివృద్ధి పనుల్లో లోపాలను ప్రశ్నిస్తే అభివృద్ధికి అడ్డుపడుతున్నారని దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఆలయ అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలను దేవాలయం లోపల ఏర్పాటు చేయడం సమంజసం కాదని, భక్తులు దేవుడిని దర్శించుకోవడానికి వస్తారా.. శిలాఫలకాలను చూడటానికి వస్తారా అని ప్రశ్నించారు. ప్రజల దృష్టిని మరల్చేందుకే చెరువు కట్టపై బండ్ ప్రారంభించారని ఆరోపించారు. ఆషాఢ మాసంలో ప్రారంభోత్సవాలు నిర్వహిస్తూ మరోవైపు ఆగమశాస్త్రం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఆలయ అభివృద్ధిపై ఎలాంటి చర్చకైనా తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అభివృద్ధి పేరుతో వందల కోట్ల రూపాయల నిధులు దుర్వినియోగమవుతున్నాయని ఆరోపించారు. ఆలయ గర్భాలయాన్ని తాకే ప్రయత్నం చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. గతంలో పవర్ ప్రజెంటేషన్‌లో వివరించిన విధంగానే పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆలయ అభివృద్ధి విషయంలో పార్టీలకు అతీతంగా అందరినీ కలుపుకొని శ్రావణమాసంలో భక్తులతో కలిసి నిరసన కార్యక్రమం చేపడతామని ప్రకటించారు. ఆలయ అభివృద్ధి కోసం పట్టణ ప్రజలు ఎంతో త్యాగం చేస్తున్నారని, వారికి తగిన గుర్తింపు ఇవ్వడం లేదన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని, ఏకాంత సేవలు, పూజా విధానాలపై సరైన పర్యవేక్షణ ఉండాలని కోరారు. అమ్మవారి బంగారు ఆభరణాల అలంకరణ, భద్రతపై కూడా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. భీమేశ్వరస్వామి ఆలయంలో నంది విగ్రహం దెబ్బతిన్న స్థితిలో ఉండగా పూజలు నిర్వహించడం ఏ ఆగమశాస్త్రంలో ఉందని ప్రశ్నించారు. ప్రజెంటేషన్‌లో పేర్కొన్న విధంగానే ఆలయ అభివృద్ధి పనులు చేపట్టాలని ప్రతాప రామకృష్ణ డిమాండ్ చేశారు. సమావేశంలో బీజేపీ నాయకులు రాపల్లి శ్రీధర్, రేగుల మల్లికార్జున్, కుమ్మరి శంకర్, కొండ్లెపు ముత్యం తదితరులు పాల్గొన్నారు.

# త్రోబాల్‌లో కొత్తపల్లి వారియర్స్ జయకేతనం

- రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రథమ స్థానం.. వరుసగా నాలుగోసారి జాతీయస్థాయికి
- క్రీడాకారిణి పంపరి హారికకు రూ.1.30 లక్షల విలువైన ఎలక్ట్రిక్ వాహనం



గంభీరావుపేట, ఆగస్టు 10 (జనంసాక్షి): రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన కొత్తపల్లి వారియర్స్ త్రోబాల్ జట్టు రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. దీంతో వరుసగా నాలుగోసారి జాతీయస్థాయి ఈశా త్రోబాల్ పోటీలకు అర్హత సాధించిన తొలి జట్టుగా రికార్డు సృష్టించింది. ఈశా ఆధ్వర్యంలో 18వ రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలు ఆదివారం కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించారు. జిల్లాస్థాయిలో విజయం సాధించిన ప్రతి జిల్లా నుంచి రెండు జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. కొత్తపల్లి వారియర్స్ జట్టు ప్రతి మ్యాచ్‌లో మెరుగైన ఆటతీరును కనబరుస్తూ ఫైనల్‌కు చేరుకుంది. తుది పోరులో రాచర్ల గొల్లపల్లి జట్టును ఓడించి రాష్ట్రస్థాయి టైటిల్‌ను సొంతం చేసుకుంది. విజేత జట్టుకు రూ.15 వేల నగదు బహుమతితోపాటు సర్టిఫికెట్లు అందజేశారు. టోర్నమెంట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన కొత్తపల్లి క్రీడాకారిణి పంపరి హారికకు ప్రత్యేక బహుమతితోపాటు సుమారు రూ.1.30 లక్షల విలువైన ఎలక్ట్రిక్ వాహనాన్ని అందజేశారు. ఈ బహుమతిని అందుకున్న తొలి క్రీడాకారిణిగా హారిక నిలిచిందని జట్టు కోచ్, జడ్పీహెచ్‌ఎస్ కొత్తపల్లి వ్యాయామ ఉపాధ్యాయుడు భాను తెలిపారు. జట్టు కెప్టెన్ కె. శిరీషతోపాటు బి. లావణ్య, పి. శశిరేఖ, ఇ. రేఖ, ఎం. భార్గవి, పి. లీలావతి, చ. దేవిప్రియ, పి. స్వాతి, పి. హారికలు అద్భుతమైన ఆటతీరును ప్రదర్శించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. జాతీయస్థాయి ఈశా త్రోబాల్ పోటీలు సెప్టెంబర్ మొదటి వారంలో తమిళనాడులోని కోయంబత్తూరులో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. క్రీడాకారులను మొదటి నుంచి ప్రోత్సహిస్తూ సహకరిస్తున్న కొత్తపల్లి జడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయుడు నారాయణ్ వారిని అభినందించారు. క్రీడాకారుల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు అందిస్తున్న సహకారం అభినందనీయమని భాను పేర్కొన్నారు. జాతీయస్థాయి పోటీల్లోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి కొత్తపల్లి గ్రామానికి, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో బీజేపీ శ్రేణులు

### ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగురవేయాలని పిలుపు



**ఇల్లంతకుంట, జూలై 10 (జనంసాక్షి):** ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో ఇల్లంతకుంట మండల బీజేపీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటారు. ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి జాతీయ ఐక్యత, దేశభక్తి భావాలను పెంపొందించాలని బీజేపీ నాయకులు ప్రజలకు పిలుపునిచ్చారు. దేశ స్వాతంత్ర్య స్ఫూర్తిని ప్రతి ఒక్కరిలో చాటిచెప్పేలా కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు అనిల్‌కుమార్, లచ్చయ్య, గాదె మధుసూదన్, కరికే నవీన్, పలమరు రవి, పయ్యావుల బాలయ్య, చంద్రశేఖర్, శ్రీశైలం తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కనపర్తి కాంగ్రెస్ గ్రామ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

### నూతన కమిటీని ఎన్నుకున్న కాంగ్రెస్ కార్యకర్తలు



**వీణవంక, ఆగస్టు 10 (జనంసాక్షి):** వీణవంక మండలంలోని కనపర్తి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించి నూతన గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామంలోని మెజార్టీ కార్యకర్తల అభిప్రాయం మేరకు అల్లపురెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడిగా అల్లపురెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా పులి మధునయ్య, పంజాల శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా అనుమండ్ల గోపాల్‌రెడ్డి, కార్యదర్శిగా పర్లపల్లి వెంకటస్వామి, కోశాధికారిగా ఎల్కపల్లి ప్రశాంత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా ముంజ ప్రవీణ్, రామంచ పూర్ణచందర్, మడ్డి తిరుపతి, ముత్యాల హుస్సేన్, అల్లపురెడ్డి సమ్మిరెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్‌రెడ్డి, మండల సీనియర్ నాయకుడు ఎండీ సాహెబ్ హుస్సేన్, నాయకులు కొమ్మిడి రాకేష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మేకల ఎల్లారెడ్డి, పర్లపల్లి రమేష్, డైరెక్టర్ శ్రీపతిరెడ్డి, పల్లెర్ల కిరణ్, పత్తి సమ్మిరెడ్డి, బోళ్ళు సదానందం, కొమురరెడ్డి, వార్డు సభ్యులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పీఏసీఎస్ చైర్మన్ గూడెం శ్రీనివాస్‌రెడ్డికి అభినందనలు



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 10 (జనంసాక్షి):** ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) కామారెడ్డి చైర్మన్‌గా నూతనంగా నియమితులైన గూడెం శ్రీనివాస్‌రెడ్డిని కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డికి పూలమాలలు వేసి, శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కామారెడ్డి నియోజకవర్గ రైతాంగ సంక్షేమంతోపాటు సహకార సంఘం అభివృద్ధికి ఆయన మరింత కృషి చేయాలని ఉమారాణి శ్రీనివాస్ ఆకాంక్షించారు. రైతులకు మెరుగైన సేవలు అందిస్తూ, వారి సమస్యల పరిష్కారానికి సహకార సంఘం ద్వారా అవసరమైన సహకారం అందించాలని కోరారు. చైర్మన్‌గా గూడెం శ్రీనివాస్‌రెడ్డి విజయవంతంగా బాధ్యతలు నిర్వహించి రైతులకు మరింత సేవలందించాలని ఆమె ఆకాంక్షించారు.

## ఖమ్మంపల్లి ట్రాక్టర్ యూనియన్‌కు నూతన కమిటీ

### అధ్యక్షుడిగా చింతం శ్రీనివాస్ ఏకగ్రీవ ఎన్నిక



**ముత్తారం, ఆగస్టు 10 (జనంసాక్షి):** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఖమ్మంపల్లి గ్రామంలో శ్రీ సమ్మక్క సారక్క ట్రాక్టర్ ఓనర్స్ అసోసియేషన్ నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా చింతం శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా సోమిశెట్టి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా బుద్దార్తి సంజీవ్, సంయుక్త కార్యదర్శిగా ఉగ్గే మొగిలి, కోశాధికారిగా పన్నాల సురేష్, కార్యవర్గ సభ్యులుగా అల్లం నరేష్, చింతం లక్ష్మణ్, సలహాదారుగా బగ్గని స్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు చింతం శ్రీనివాస్ మాట్లాడుతూ ట్రాక్టర్ యజమానులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కృషి చేస్తానని తెలిపారు. యజమానుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం యూనియన్ తరఫున నిరంతరం పోరాడతామని పేర్కొన్నారు. శ్రీ సమ్మక్క సారక్క ట్రాక్టర్ ఓనర్స్ అసోసియేషన్‌ను త్వరలో రిజిస్ట్రేషన్ చేయించేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. నూతన కమిటీకి ట్రాక్టర్ యజమానులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు తీర్థాల లక్ష్మయ్యతోపాటు ట్రాక్టర్ యజమానులు తీర్థాల స్వామి నారాయణ, శంకర్, రంజిత్, రాకేష్, శేఖర్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎలుక కమలాకర్



**మల్లాపూర్, ఆగస్టు 10 (జనంసాక్షి):** ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎలుక కమలాకర్‌ను నియమిస్తూ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మగ్గిడి వెంకట నరసయ్య ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు సోమవారం మెట్‌పల్లి పట్టణంలో ఎలుక కమలాకర్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మగ్గిడి వెంకట నరసయ్య మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాల సాధనకు కృషి చేస్తూనే యువజన సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు పనిచేయాలని సూచించారు. తనను జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించినందుకు ఎలుక కమలాకర్ కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన జాతీయ ఉపాధ్యక్షుడు మగ్గిడి వెంకట్ నరసయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాల్క మోహన్, రాష్ట్ర కార్యదర్శి నేరెళ్ల శ్రీధర్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పెంటపర్తి అశోక్, మెట్‌పల్లి డివిజన్ కమిటీ నాయకులు తుక్కారాం, కోరుట్ల డివిజన్ అధ్యక్షుడు శోభన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడి మృతి



**సిరికొండ, ఆగస్టు 10 (జనంసాక్షి):** సిరికొండ మండలంలోని తాళ్ల రామడుగు శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన 78 ఏళ్ల వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. తాళ్ల రామడుగుకు చెందిన సాయిరి నర్సయ్య రహదారిపై వెళ్తుండగా గడ్కోల్ వైపు నుంచి వచ్చిన బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నర్సయ్యకు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు సిరికొండ ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆస్పత్రికి చేరుకున్నారు. నర్సయ్య మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు విషాదంలో మునిగిపోయారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# మత్తులో మునిగిపోతున్న యువత భవిష్యత్తు ఏటు?

- క్షణిక ఆనందం కోసం జీవితాలను పణంగా పెడుతున్న వైనం
- కుటుంబాలు, సమాజంపై తీవ్ర ప్రభావం.. అవగాహనతోనే అడ్డుకట్ట




**గంభీరావుపేట, ఆగస్టు 10 (జనంసాక్షి):** యువత దేశానికి వెన్నెముక. సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాల్సిన యువతలో కొంతమంది మద్యం, మత్తు పదార్థాల బారిన పడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. సరదాగా మొదలయ్యే అలవాటు క్రమంగా వ్యసనంగా మారి చదువు, ఉద్యోగం, కుటుంబ సంబంధాలు, ఆరోగ్యం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతోంది. మత్తు పదార్థాలకు బానిసైన యువత విలువైన సమయాన్ని, అవకాశాలను కోల్పోతూ జీవితాలను ప్రమాదంలోకి నెట్టుకుంటున్నారు. ముఖ్యంగా మద్యం, మత్తు పదార్థాల ప్రభావంలో వాహనాలు నడపడం ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉన్నందున యువత వాహనం నడిపేటప్పుడు పూర్తిగా వాటికి దూరంగా ఉండాలి. స్నేహితుల ఒత్తిడికి లోనుకాకుండా, మత్తు ప్రభావంలో ఉన్న వ్యక్తులతో కలిసి ప్రయాణించకుండా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల కదలికలను గమనిస్తూ రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలి. స్నేహితుల ఒత్తిడి, కొత్తదనం తెలుసుకోవాలనే ఆసక్తి, ఒత్తిడి నుంచి బయటపడాలనే భావన వంటి కారణాలతో కొంతమంది యువత తొలిసారి మత్తు పదార్థాలను ప్రయత్నిస్తున్నారు. అయితే ఒకసారి అలవాటు ఏర్పడితే దాని నుంచి బయటపడటం కష్టంగా మారుతోంది. 'ఒక్కసారి మాత్రమే' అని మొదలైన అలవాటు క్రమంగా నిత్య జీవితంలో భాగమై వ్యసనంగా మారే ప్రమాదం ఉంది. మత్తు పదార్థాల ప్రభావం విద్యార్థుల విద్యా జీవితంపైనా పడుతోంది. పాఠశాలలు, కళాశాలలకు క్రమం తప్పడం, చదువుపై ఆసక్తి తగ్గడం, ఏకాగ్రత లోపించడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రతిభ ఉన్న విద్యార్థులు సైతం సరైన దిశలో ముందుకు సాగలేక అవకాశాలను కోల్పోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. యువత మత్తుకు బానిస కావడం వ్యక్తిగత సమస్యకే పరిమితం కాకుండా కుటుంబ సమస్యగా మారుతోంది. పిల్లల ప్రవర్తనలో మార్పులు గమనించిన తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇంట్లో గొడవలు, నమ్మకం కోల్పోవడం, ఆర్థిక ఇబ్బందులు వంటి సమస్యలు కుటుంబ ప్రశాంతతను దెబ్బతీస్తున్నాయి. మత్తు పదార్థాల వినియోగం శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది. నిద్రలో మార్పులు, ఏకాగ్రత తగ్గడం, చిరాకు, ఆందోళన వంటి సమస్యలు తలెత్తవచ్చు. దీర్ఘకాలంలో ఆరోగ్య సమస్యలు మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉన్నందున ప్రారంభ దశలోనే ఈ అలవాటును అడ్డుకోవడం అవసరం. సోషల్ మీడియా ద్వారా కనిపించే కొన్ని తప్పుదోవ పట్టించే కంటెంట్, మత్తు పదార్థాలను 'స్టైల్'గా చూపించే ధోరణి యువతపై ప్రభావం చూపే అవకాశం ఉంది. నిజ జీవితంలో ఎదురయ్యే సమస్యలకు మత్తు పరిష్కారం కాదనే విషయాన్ని యువత గుర్తించాలి. పిల్లలను మత్తు బారి నుంచి దూరంగా ఉంచడంలో తల్లిదండ్రుల పాత్ర కీలకం. వారితో భయపెట్టి కాకుండా స్నేహపూర్వకంగా మాట్లాడాలి. వారి స్నేహితులు, రోజువారీ కార్యకలాపాలు, చదువు, ఆసక్తులను తెలుసుకుంటూ ఉండాలి. ప్రవర్తనలో ఆకస్మిక మార్పులు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా సున్నితంగా స్పందించాలి. పాఠశాలలు, కళాశాలల్లో మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై తరచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. విద్యార్థులకు మత్తు పదార్థాలకు 'నో' చెప్పే ధైర్యంతోపాటు ఒత్తిడిని ఆరోగ్యకరమైన పద్ధతుల్లో ఎదుర్కొనే మార్గాలను తెలియజేయాలి. క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నైపుణ్యాభివృద్ధి వంటి సానుకూల కార్యకలాపాల వైపు యువతను మళ్లించాలి. మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలను అడ్డుకోవడంలో పోలీసుల చర్యలతోపాటు ప్రజల సహకారం కూడా అవసరం. అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలి. యువతను తప్పుదోవ పట్టించే వ్యక్తులు, ముఠాలపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. యువతకు మత్తు కాదు.. మంచి భవిష్యత్తే లక్ష్యంగా ఉండాలి. విద్య, క్రీడలు, ఉద్యోగ నైపుణ్యాలు, కళలు, సామాజిక సేవ వంటి సానుకూల మార్గాల్లో తమ శక్తిని వినియోగిస్తే వ్యక్తిగతంగా ఎదగడంతోపాటు సమాజానికి కూడా మేలు చేకూరుతుంది. మత్తు పదార్థాలకు దూరంగా ఉంచడం ఒక్క యువకుడి బాధ్యత మాత్రమే కాకుండా కుటుంబం, విద్యాసంస్థలు, సమాజం, ప్రభుత్వ యంత్రాంగం సమష్టిగా చేపట్టాల్సిన బాధ్యత. యువత భవిష్యత్తును కాపాడితేనే దేశ భవిష్యత్తు సురక్షితంగా ఉంటుంది.

## వృద్ధురాలి మెడలో నుంచి పుస్తెలతాడు చోరీ

### ఘటనపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు



**ముత్తారం, ఆగస్టు 10 (జనంసాక్షి):** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం లక్కారం గ్రామంలో అర్ధరాత్రి చోరీ ఘటన చోటుచేసుకుంది. ఇంటి బయట నిద్రిస్తున్న 80 ఏళ్ల వృద్ధురాలి మెడలోని సుమారు రెండు తులాల పుస్తెలతాడును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించి పరారైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గ్రామానికి చెందిన బర్ల లక్ష్మి (80) ఇంటి బయట నిద్రిస్తుండగా, ఆమె కుమారుడు బర్ల మొగిలి భార్యతో కలిసి ఇంట్లో నిద్రిస్తున్నాడు. అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి బయట తలుపులకు బేడం వేసి, బయట నిద్రిస్తున్న లక్ష్మి మెడలోని పుస్తెలతాడును చాకచక్యంగా అపహరించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. చోరీ జరిగిన విషయాన్ని గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ రవికుమార్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు చోరీకి పాల్పడిన వ్యక్తుల ఆచూకీ కోసం వివరాలు సేకరిస్తున్నారు.

## చెక్ పవర్ రద్దు చేస్తే ఉద్యమిస్తాం



**మల్యాల, ఆగస్టు 10 (జనంసాక్షి):** ఉప సర్పంచుల చెక్ పవర్‌ను రద్దు చేసి కార్యదర్శులకు అప్పగించాలన్న ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ ఉద్యమిస్తామని తెలంగాణ రాష్ట్ర ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షుడు బొట్ల కార్తీక్ హెచ్చరించారు. మల్యాల మండల కేంద్రంలోని బ్లాక్ చౌరస్తా వద్ద సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉప సర్పంచుల చెక్ పవర్‌ను తొలగించి కార్యదర్శులకు ఇవ్వాలని కొందరు సర్పంచులు కోరడం సరికాదన్నారు. కార్యదర్శులు ప్రభుత్వ ఉద్యోగులని, గ్రామ పాలనలో ప్రత్యక్షంగా ప్రజలతో మమేకమై పనిచేసేది ఉప సర్పంచులేనని పేర్కొన్నారు. గ్రామ సమస్యల పరిష్కారంలో సర్పంచులతో సమానంగా, కొన్ని సందర్భాల్లో మరింత చురుగ్గా ఉప సర్పంచులు పనిచేస్తున్నారని తెలిపారు. ఉప సర్పంచుల చెక్ పవర్‌ను రద్దు చేసే ప్రయత్నం చేస్తే ఆందోళనలు చేపడతామని, అవసరమైతే బాధ్యుల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఉప సర్పంచుల హక్కులను కాపాడేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన ఉప సర్పంచులు పాల్గొన్నారు.

# కార్పొరేట్, మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాటం

కరీంనగర్ టౌన్, ఆగస్టు 10 (జనంసాక్షి): కార్పొరేట్, మతోన్మాద శక్తుల విధానాలకు వ్యతిరేకంగా శ్రామిక వర్గం ఐక్యంగా పోరాడాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గీట్ల ముకుందరెడ్డి పిలుపునిచ్చారు. దేశవ్యాప్త జైల్‌భరో పిలుపులో భాగంగా సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం కళాభారతి నుంచి గీతాభవన్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ముకుందరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టే వరకు ఉద్యమాలు కొనసాగిస్తామని అన్నారు. 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడం ద్వారా కార్మికుల హక్కులను హరించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రతతోపాటు పీఎఫ్, ఈఎస్ఐ, సంక్షేమ పథకాల రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి మాట్లాడుతూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల వల్ల దేశ వ్యవసాయ రంగానికి, రైతులకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. విద్యుత్ సవరణ బిల్లు అమలైతే గృహ, వ్యవసాయ, చిన్న పరిశ్రమలపై విద్యుత్ భారం పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి




సుంకరి సంపత్ మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని బలోపేతం చేసి ఏడాదికి 100 రోజుల పని కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, యువత, విద్యార్థులు ఐక్యంగా దీర్ఘకాలిక పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ, రైతు సంఘం, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, ఐద్వా తదితర సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆర్‌సీఓఏ క్లబ్‌లో ఆకట్టుకున్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నాటిక

గోదావరిఖని, ఆగస్టు 10 (జనం సాక్షి):లిలి రామగుండం ఏరియా-1 పరిధిలోని ఆర్‌సీఓఏ క్లబ్‌లో సోమవారం సాయంత్రం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జీవిత చరిత్ర, ఆశయాలు, రాజ్యాంగ విలువలు, సామాజిక సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన కృషిని ప్రతిబింబించేలా ప్రత్యేక నాటిక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రామగుండం ఏరియా-1 జనరల్ మేనేజర్ డి. లలిత్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించి నాటిక ప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం నాటికను వీక్షించిన జీఎం లలిత్ కుమార్ మాట్లాడుతూ.. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జీవితం, ఆయన ఆశయాలు, సమాజానికి అందించిన సేవలు, సమానత్వం, సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటాన్ని నాటిక రూపంలో కళాకారులు ఎంతో చక్కగా ప్రదర్శించారని అభినందించారు. ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా అంబేద్కర్ ఆలోచనలు, రాజ్యాంగ విలువలు, సామాజిక బాధ్యతలపై ప్రజల్లో మరింత అవగాహన పెంపొందుతుందని పేర్కొన్నారు. నాటికలో అంబేద్కర్ బాల్యం నుంచి ఆయన విద్యాభ్యాసం, ఎదుర్కొన్న సామాజిక వివక్ష, విద్య ద్వారా సాధించిన ఉన్నత స్థానం, అణగారిన వర్గాల హక్కుల కోసం చేసిన పోరాటం, భారత రాజ్యాంగ రూపకల్పనలో ఆయన పోషించిన కీలక పాత్ర వంటి అంశాలను కళాకారులు భావోద్వేగభరితంగా ప్రదర్శించారు. నాటిక ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోవడంతో పాటు సామాజిక సమానత్వం, రాజ్యాంగ స్ఫూర్తి పట్ల ఆలోచింపజేసింది. సింగరేణి సంస్థలో



ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, ప్రజల్లో కళా, సాంస్కృతిక కార్యక్రమాల పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు ఇటువంటి నాటికలు, సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు జీఎం తెలిపారు. అంబేద్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో నాటిక వంటి కళారూపాలు ప్రభావవంతమైన మాధ్యమాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎం (ఫారెస్ట్) కర్ణ, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, దేవిద్, హనుమంతరావు, సీఎంఓఏఐ ప్రతినిధి శ్రవణ్ కుమార్, అభ్యుదయ నిర్వాహకులు జగ్గారాజు, జనగామ నర్సయ్య, పులి మోహన్, సీఐటీయూ నాయకులు బొజ్జ బిక్షమయ్య, రాజిరెడ్డి, వడ్డెపెల్లి శంకర్, ఏఐపియూసీ ప్రతినిధి ఇజ్జగిరి, రాజు తదితర అధికారులు, ఉద్యోగులు, కార్మికులు, కుటుంబ సభ్యులు, కళాభిమానులు పాల్గొని నాటికను ఆసక్తిగా వీక్షించారు.

# ఆదివాసీల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వాలు కృషి చేయాలి



కరీంనగర్ టౌన్, ఆగస్టు 10 (జనంసాక్షి): ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆల్ ఇండియా ఎరుకల హక్కుల పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మానుపాటి రవి ఆదివాసీలకు శుభాకాంక్షలు తెలిపారు. ఆదివాసీల హక్కులు, భూమి, అటవీ వనరులు, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రభుత్వాలు మరింత కృషి చేయాలని కోరారు. 1982 ఆగస్టు 9న జెనీవాలో జరిగిన సమావేశాల అనంతరం ఐక్యరాజ్యసమితి ఆదివాసీల హక్కులు, సంరక్షణకు ప్రాధాన్యం కల్పించిందని తెలిపారు. 1994 నుంచి ప్రతి ఏటా ఆగస్టు 9న అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భారత రాజ్యాంగం, ప్రత్యేక చట్టాల ద్వారా ఆదివాసీల భూమి, సంస్కృతి, జీవనోపాధికి హక్కులు కల్పించినప్పటికీ వాటి అమలు పూర్తిస్థాయిలో జరగకపోవడంతో అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు. కొమురం భీమ్ స్ఫూర్తితో జల్, జంగల్, జమీన్ హక్కుల కోసం ఆదివాసీలు సాగించిన పోరాటాలను ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఆదివాసీల విద్య, ఉపాధి, వైద్యం, ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని మానుపాటి రవి కోరారు.

# కేటీఆర్‌ను విమర్శిస్తే ఊరుకునేది లేదు




సిరిసిల్ల టౌన్, ఆగస్టు 10 (జనంసాక్షి): సిరిసిల్ల నియోజకవర్గ ఎమ్మెల్యే కేటీఆర్‌పై కొంతమంది కాంగ్రెస్ నాయకులు ఇష్టానుసారంగా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు బీఆర్ఎస్ విద్యార్థి నాయకులు సబ్బని హరీష్, కంచర్ల రవి గౌడ్ అన్నారు. సోమవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కేటీఆర్ సిరిసిల్లలో ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నించడం సరికాదని, ఆయన హయాంలో జరిగిన అభివృద్ధి ఏమిటో సిరిసిల్ల ప్రజలకు తెలుసన్నారు. కేటీఆర్ నేతన్నలకు రూ.352 కోట్ల బకాయిలు పెట్టారని కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.152 కోట్లు మాత్రమే బకాయిలు చెల్లించిందని, ఇంకా సుమారు రూ.150 కోట్ల బకాయిలు ఉన్నాయని పేర్కొన్నారు. పద్మశాలీలను కాంగ్రెస్‌లోకి బెదిరించి తీసుకెళ్లే ప్రయత్నాలు చేయడం ఆ పార్టీకి తగదని విమర్శించారు. బీఆర్ఎస్ ఏనాడూ విభజించి పాలించే రాజకీయాలు చేయలేదని అన్నారు. నేతన్నలు ఆత్మహత్యలకు పాల్పడిన సమయంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ స్పందించి నేత కార్మికులను ఆదుకునేందుకు రూ.50 లక్షల నిధులు సమకూర్చిన విషయాన్ని గుర్తుచేశారు. బీఆర్ఎస్, కేటీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజలకు తెలుసన్నారు. కేటీఆర్‌పై ఇష్టానుసారంగా విమర్శలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో కత్తెర వరుణ్, తుమ్మరాజు, మోతే మహేష్, ప్రశాంత్, షేక్ జుబేర్, అనిరుద్, శివ, పులి సాయి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రత కార్యక్రమం



కథలాపూర్, ఆగస్టు 10 (జనం సాక్షి): కథలాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో సోమవారం పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. కార్యాలయాలు, పాఠశాలల పరిసరాలను శుభ్రం చేసి, పెరిగిన గడ్డి, పిచ్చి మొక్కలను తొలగించడంతో పాటు గడ్డి మందు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ప్రజలకు, విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించవచ్చని నిర్వాహకులు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల పరిసరాల్లో పరిశుభ్రతను నిరంతరం కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ న్యావనంది శేఖర్, ఉప సర్పంచ్ చెట్‌పల్లి ప్రసాద్, వార్డు సభ్యులు దేవేందర్, రాజశేఖర్, వాణి సాయబ్, ఖాజాబీ హుస్సేన్, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# కొండగట్టు అంజన్న సేవలో గాయని మంగ్లీ



మల్యాల, ఆగస్టు 10 (జనం సాక్షి): తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయాన్ని సోమవారం ప్రముఖ జానపద, సినీ గాయని మంగ్లీ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మంగ్లీకి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేసి ఆశీర్వదించారు. ఆలయ అధికారులు, అర్చకులు ఆమె దర్శనానికి సంబంధించిన ఏర్పాట్లు చేశారు.

# జిల్లా ఉప సర్పంచుల ఫోరం ప్రధాన కార్యదర్శిగా చెటుపల్లి ప్రసాద్



కథలాపూర్, ఆగస్టు 10 (జనంసాక్షి): జగిత్యాల జిల్లా ఉప సర్పంచుల ఫోరం ప్రధాన కార్యదర్శిగా కథలాపూర్ మండల కేంద్రానికి చెందిన ఉపసర్పంచ్ చెటుపల్లి ప్రసాద్‌ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు బొట్ల కార్తీక్ తెలిపారు. సోమవారం ఆయన ప్రసాద్‌కు నియామక బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా చెటుపల్లి ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలోని వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఉప సర్పంచుల హక్కులు, సమస్యలపై సంఘం తరఫున నిరంతరం పోరాడుతామని పేర్కొన్నారు. తనకు బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు బొట్ల కార్తీక్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ముత్యాల స్వామి, రాష్ట్ర ఉపాధ్యక్షులు గనవేని నందిని మల్లేష్, రాష్ట్ర కార్యదర్శి మెరుగు జంపన్న, కథలాపూర్ మండల అధ్యక్షుడు అన్నారపు నర్సయ్యతోపాటు వివిధ గ్రామాల ఉప సర్పంచులు పాల్గొన్నారు.

## తాత్కాలిక మట్టిరోడ్డు తెగిపోవడంతో ప్రజలకు అవస్థలు





గంభీరావుపేట ఆగస్టు10(జనంసాక్షి) ;అకాల వర్షాలకు గంభీరావుపేట లింగన్నపేట మధ్య ఏర్పాటు చేసిన తాత్కాలిక మట్టిరోడ్డు తెగిపోవడంతో గంభీరావుపేట, మరియు ముస్తాబాద్ వివిధ మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎగువ మానేరు లోకి పాల్వంచ వాగు రావడంతో ఎగువ మానేరు వర్షపు నీటి ప్రవాహంతో మట్టిరోడ్డు కొట్టుకుపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడి, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.ఈ మార్గంలో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు కొనసాగుతున్నప్పటికీ, పనులు నత్తనడకన సాగుతుండటంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బ్రిడ్జి పనులను వేగవంతం చేయాల్సిన కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మాజీ శాసనసభ్యులు కటకం మృత్యుంజయం అన్నారుతాత్కాలిక రహదారి పదేపదే దెబ్బతింటుండటంతో అత్యవసర పనుల కోసం వెళ్లే ప్రజలు, రైతులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి, తాత్కాలిక రహదారికి మరమ్మతులు చేపట్టి, హైలెవల్ బ్రిడ్జి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని, కటకం మృత్యుంజయం కోరారు.

## వృద్ధురాలి మెడలో నుంచి పుస్తెలతాడు చోరీ

**ముత్తారంఆగస్టు 10(జనంసాక్షి):** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం లక్కారం గ్రామంలో అర్ధరాత్రి చోరీ ఘటన చోటుచేసుకుంది. ఇంటి



బయట నిద్రిస్తున్న 80 ఏళ్ల వృద్ధురాలి మెడలో నుంచి గుర్తుతెలియని వ్యక్తులు సుమారు రెండు తులాల పుస్తెలతాడును అపహరించి పరారైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.గ్రామానికి చెందిన బర్ల లక్ష్మి (80) ఇంటి బయట నిద్రిస్తుండగా, ఆమె కుమారుడు బర్ల మొగిలి తన భార్యతో కలిసి ఇంట్లో నిద్రిస్తున్నాడు. ఈ క్రమంలో అర్ధరాత్రి సమయంలో ఇంటి బయట తలుపులకు గుర్తుతెలియని వ్యక్తులు బెడం వేసి, బయట నిద్రిస్తున్న లక్ష్మి మెడలోని పుస్తెలతాడును చాకచక్యంగా అపహరించినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. చోరీ జరిగిన విషయాన్ని గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిసింది. సమాచారం అందుకున్న ఎస్సై రవికుమార్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించినట్లు సమాచారం. ఘటనపై దర్యాప్తు చేపట్టి చోరీకి పాల్పడిన వ్యక్తుల ఆచూకీ కోసం పోలీసులు వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు

## శంకరపట్నంలో ఘనంగా తెలంగాణ రక్షణ సేన జెండా పండుగ



**శంకరపట్నం ఆగస్టు 10 (జనం సాక్షి):**తెలంగాణ రక్షణ సేన పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడాలని మానకొండూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెన్నమల్ల చైతన్య పిలుపునిచ్చారు. శంకరపట్నం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో సోమవారం నిర్వహించిన తెలంగాణ రక్షణ సేన పార్టీ జెండా పండుగలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా చెన్నమల్ల చైతన్య మాట్లాడుతూ.. పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత నిర్దేశించిన ఆశయాలు, పాంచజన్య సూత్రాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. తెలంగాణ ప్రజల హక్కులు, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం, విద్య, ఉపాధి, రైతు సంక్షేమం వంటి అంశాలపై ప్రజల పక్షాన నిలిచి పోరాడాలని సూచించారు. జెండా పండుగ కేవలం ఒక కార్యక్రమం కాదని, పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలను గ్రామగ్రామాన ప్రతి గడపకు తీసుకెళ్లే సంకల్పానికి ప్రతీక అని అన్నారు. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలపార్టీ జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ.. కల్వకుంట్ల కవిత ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ప్రతి కార్యకర్త ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని అన్నారు. శంకరపట్నం మండలంలో జెండా పండుగ పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపిందని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో పార్టీ కమిటీలను బలోపేతం చేసి, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ లింగంపల్లి నాగరాజు మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేస్తూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. భారీగా పాల్గొన్న పార్టీ శ్రేణులుకార్యక్రమం పార్టీ సీనియర్ నాయకురాలు సల్మా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా అసెంబ్లీ ఇన్‌చార్జ్ మజీద్‌తో పాటు పార్టీ సీనియర్ నాయకులు శ్రీరాముల రమేష్, కుతాడి శ్రీనివాస్, బోడిగే పరశురాం గౌడ్, అతహర్, జైపాల్ రెడ్డి, సౌరబ్ సింగ్, బండమీది అంజన్న, ధర్మారెడ్డి, రంగనవేణి లక్ష్మణ్, చంటి శ్రీనివాస్, మేక వినోద్, బాసవేని రాజేందర్, కొండపాక రాకేష్, ఎర్రవెల్లి మహేష్, బండ అశోక్, సంతోష్ యాదవ్, సురేష్, సాయి, రవి, రజి, సాయిచరణ్, ఎండి .జెండా ఆవిష్కరణ అనంతరం పార్టీ శ్రేణులు ఉత్సాహంగా నినాదాలు చేస్తూ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శంకరపట్నం మండలంలోని ప్రతి గ్రామంలో పార్టీని బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు కొనసాగించాలని నాయకులు, కార్యకర్తలు ప్రతిజ్ఞ చేశారు. ప్రతి కార్యకర్త క్రమశిక్షణతో సైనికుడిలా పనిచేస్తే తెలంగాణ రక్షణ సేన పార్టీని బలమైన ప్రజా ఉద్యమ శక్తిగా తీర్చిదిద్దవచ్చని నాయకులు పేర్కొన్నారు.

## దుబ్బ మల్లన్న స్వామి దేవస్థానాన్ని సందర్శించిన ఎండోమెంట్ అధికారులు



**జమ్మికుంట, ఆగస్టు 10 (జనం సాక్షి):**జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ధర్మారం గ్రామ శివారులో గల అతి పురాతనమైన శ్రీ దుబ్బ మల్లన్న దేవస్థానాన్ని ఎండోమెంట్ అధికారులు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ ముద్దమల్ల రవి ఆలయ అధికారులకు ఘన స్వాగతం పలికారు.అతి పురాతన దైవ క్షేత్రంగా పేరు పొందిన శ్రీ దుబ్బ మల్లన్న ఆలయ ప్రాంగణంలో గల పోచమ్మ గుడి,ఎల్లమ్మ గుడి ల అభివృద్ధి కొరకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు.ఆలయ అభివృద్ధి పనులలో భాగంగా కామన్ గుడ్ నిధులనుండి అభివృద్ధి పనులు చేయుటకు ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్న వివిధ పనులకు ఎండోమెంట్ అధికారులు కొలతలు వేసి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఈవో సుభద్ర తెలిపారు.ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ ముద్దమల్ల రవి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వ హయాం లో ఆలయాలకు మహర్దశ పడుతుందని రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని పలు ఆలయాల పై ప్రత్యేక చొరవ చూపెడుతూ అభివృద్ధి పనులు చేపడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ ప్రణవ్ బాబు ఆధ్వర్యంలో దుబ్బ మల్లన్న స్వామి ఆలయంలో ప్రత్యేక పరిస్థితులు కల్పించడానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయడం సంతోషంగా ఉందని తెలిపారు .రాబోయే రోజుల్లో ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ముద్దమల్ల రవి,ఒకటో వార్డు కౌన్సిలర్ పోలు దివ్య బిక్షపతి, రెండవ వార్డ్ కౌన్సిలర్ పోల్సాని శిల్ప వేణు రావు, మాజీ కౌన్సిలర్ రావికంటి రాజకుమార్, ఎండోమెంట్ ఏఈ సంతోష్ రెడ్డి, టెక్నికల్ ఇంజనీర్ ప్రమోద్ పటేల్, అసిస్టెంట్ స్థాపతి వెంకటేశ్వర్లు, ఆలయ ఈవో సుభద్ర తదితరులు పాల్గొన్నారు

## బెల్ స్టార్ మైక్రో ఫైనాన్స్ గోల్డ్ లోన్ బ్రాంచ్ ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



**చిగురుమామిడి ఆగస్టు 10 (జనంసాక్షి):**మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన బెల్ స్టార్ మైక్రో ఫైనాన్స్ గోల్డ్ లోన్ (ముత్తూట్ ఫైనాన్స్)ను మండల కేంద్రంలోని ప్రజలతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చిగురు మామిడి సర్పంచ్ ఆకవరం భవాని శివప్రసాద్ తెలిపారు.చిగురుమామిడిలో ముత్తూట్ ఫైనాన్స్ నూతన బ్రాంచ్‌ను సోమవారం అత్యంత ఘనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక సర్పంచ్ ఆకావరం భవాని శివప్రసాద్,బ్రాంచ్ రీజినల్ మేనేజర్ శ్రీనివాస్, ఉపసర్పంచ్ కాశబోయిన విజయలక్ష్మి రాజు యాదవ్,క్లస్టర్ మేనేజర్ మహేష్,బ్రాంచ్ మేనేజర్ నక్క మహేందర్ లు పాల్గొని రిబ్బన్ కట్ చేసి నూతన కార్యాలయాన్ని ఘనంగా ప్రారంభించారు .ఈ సందర్భంగా సర్పంచ్ భవాని శివప్రసాద్ మాట్లాడుతూ చిగురుమామిడి మండల కేంద్రంలో ముత్తూట్ మైక్రోఫైనాన్స్ గోల్డ్ లోన్ బ్రాంచ్‌ను ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు.ఈ నూతన బ్రాంచ్ ద్వారా స్థానిక ప్రజలకు,ముఖ్యంగా స్వయం సహాయక సంఘాల మహిళలకు,చిన్న వ్యాపారులకు ఆర్థిక చేయూత లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ప్రజలు ఈ ఆర్థిక సేవలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని కోరారు.బ్యాంకు రీజినల్ మేనేజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ కస్టమర్లకు నమ్మకమైన,వేగవంతమైన ఆర్థిక సేవలు అందించడమే తమ సంస్థ ముఖ్య ఉద్దేశమన్నారు.గ్రామీణ ప్రాంతాల ఆర్థికాభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని,సులభతరమైన పద్ధతుల్లో రుణాలు అందిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటామని పేర్కొన్నారు.బ్రాంచ్ ప్రతినిధులు అతిథులను శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పోతర్ల శివాంజనేయులు, చెరుకు చిన్నసమ్మయ్య, పోతరవేణి అనిల్ యాదవ్,నాగెల్లి హరీష్,హౌస్ ఓనర్ తిరుపతిరెడ్డి, బ్రాంచ్ ఉద్యోగులు కావ్య,సురేష్ వెంకటేష్ ,అభిలాష్ ,గ్రామస్తులు బండ తిరుపతి,అంజిరెడ్డి,బుర్ర సతీష్ గౌడ్,సురుగు సత్యనారాయణ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# ప్రీ ప్రైమరీ విద్యను అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహించాలని ఎమ్మెల్యేకి వినతిపత్రం



**సుల్తానాబాద్,ఆగస్టు 10(జనంసాక్షి)** : తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావును శివ పల్లి తన నివాసంలో ప్రతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కి అంగన్వాడి టీచర్ల హెల్పర్ల సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రంలో కోరారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి జి. జ్యోతి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రీ ప్రైమరీ విద్యను పాఠశాలలకు అనుబంధం చేయడం వలన మూడు నుండి ఆరు సంవత్సరాల పిల్లలకు ఐ సి డి యస్ సేవలు దూరం అవుతున్నాయని, గత 40 సంవత్సరాలుగా అంగన్వాడి టీచర్లు మూడు నుండి ఆరు సంవత్సరాల పిల్లలకు ప్రీ స్కూలు పౌష్టికాహారం అందించడం జరుగుతుందని. ప్రీ ప్రైమరీ విద్యను అంగన్వాడీ కేంద్రాలలోనే నిర్వహించి ఐసిడిఎస్ను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. కొంతమంది ఉపాధ్యాయులు అంగన్వాడీ కేంద్రాలలో నమోదైన పిల్లలను పాఠశాలల కు పంపాలని అంగన్వాడీ టీచర్లను ఒత్తిడికి గురి చేస్తున్నారని వారి దృష్టికి తీసుకురావడం జరిగింది. ఐదు సంవత్సరాల పైన పిల్లల్ని మాత్రమే ప్రీ ప్రైమరీలో.. చేర్చుకోవడానికి ప్రభుత్వం నిర్ణయం చేయాలని కోరారు. జిల్లాకు రెగ్యులర్ డిడబ్ల్యూని నియమించాలని, ప్రైవేటు స్కూళ్లలో ఉన్న పిల్లలను ప్రీ ప్రైమరీలో చేర్చడానికి ప్రజలకు అవగాహన కల్పించి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని. కోరారు.. ఎమ్మెల్యే స్పందిస్తూ, ప్రీ ప్రైమరీ వల్ల అంగన్వాడి కేంద్రాలకు వస్తున్న ఇబ్బందులను కలెక్టర్ తో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ,కార్యక్రమంలో ఎం ఎం. హేమలత, సుజాత ,జి భార్గవి, రాజేశ్వరి, రాజమణి స్వరూప,శోభ,దేవేంద్ర అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

# నారాయణపూర్ గ్రామాన్ని ముంపుగా ప్రకటించాలని అడిగితే అక్రమ కేసులు పెట్టిస్తారా



**గంగాధర ఆగస్టు 9 (జనంసాక్షి)**:నారాయణపూర్ గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించాలని అడిగితే గ్రామ ప్రజలపై అక్రమ కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసమని చెప్పండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవి శంకర్ ప్రశ్నించారు .నారాయణపూర్ గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించాలని కోరుతూ గ్రామస్తులు చేస్తున్న నిరహార దీక్షకు గంగాధర సింగిల్ విండో మాజీ చైర్మన్ కొత్త జైపాల్ రెడ్డితో కలిసి సంఘీభావం తెలిపి ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో దేవుళ్ళ మీద ఒట్టు వేసి నారాయనాపూర్ .ఇస్తారుపల్లి. మంగ పేట.చర్లపల్లి(ఎన్).నాలుగు గ్రామాలను ముంపు గ్రామాలుగా ప్రకటించి అందరికీ నష్టపరిహారం ఇస్తానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం గెలిచిన తర్వాత మా గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించాలని అడిగిన గ్రామస్తులపై అక్రమంగా కేసులు పెట్టిస్తున్నాడని అన్నారు. గ్రామంలో పోలీసులను పెట్టి ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నారని కేసుల భయానికి ఇంటికి రానివారికోసం భార్య పిల్లలు తల్లిదండ్రులు తిండిలేక భయంతో బ్రతుకుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీని అమలు చేసి మొత్తం గ్రామాన్ని ముంపుగా ప్రక టించి అందరికీ నష్టపరి హారం అందిం చాలని గ్రామస్తుల పై పెట్టిన కేసు లను వెంటనే ఎత్తి వేయాలని లేకుంటే బిఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్య ంలో గ్రామస్తు లతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరి ంచారు. జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకవెళ్లి గ్రామం మొత్తాన్ని ముంపు గ్రామంగా ప్రకటించి అందరికి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్ర మంలో బిఆర్ఎస్ నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఒమన్‌లో మృతి చెందిన శ్రీహరి మృతదేహం స్వదేశానికి



**గంభీరావుపేట ఆగస్టు 10 ( జనం సాక్షి)** ;రాజన్న సిరి సిల్ల జిల్లా గంభీ రావుపేటమండలం నర్మాల గ్రామా నికి చెందిన గరి గంటి శ్రీహరి (45) ఒమన్‌లో మృతి చెందగాతెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి (టీజీ డబ్ల్యూ డబ్ల్యూ సి) చొరవతో ఆయన మృతదేహాన్ని స్వదేశానికి తరలించారు. గత పదేళ్లుగా ఒమన్‌లో కన్స్ట్రక్షన్ వర్కర్‌గా పనిచేస్తున్న శ్రీహరి జూలై 29న అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుండెపోటుతో మృతి చెందారు. చట్టపరమైన ఇబ్బందుల కారణంగా మృతదేహం తరలింపులో జాప్యం ఏర్పడగా, కుటుంబ సభ్యుల సమాచారం మేరకు మస్కట్ కోఆర్డినేటర్ గోగు దేవరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొలాజీ శ్రీనివాస్ భారత కాన్సులేట్, సంబంధిత అధికారులు, కంపెనీ స్పాన్సర్‌తో సంప్రదింపులు జరిపారు. వారి చొరవతో అవసరమైన ప్రక్రియ పూర్తి చేసి మృతదేహాన్ని స్వదేశానికి తరలించారు. హైదరాబాద్ విమానాశ్రయం నుంచి నర్మాల గ్రామానికి ఉచిత అంబులెన్స్ సౌకర్యాన్ని కూడా ఎన్ఆర్ఐ విభాగం సహకారంతో ఏర్పాటు చేశారు. సహకరించిన భారత కాన్సులేట్, ఒమన్ అధికారులు, ప్రభుత్వానికి శ్రీహరి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, టి యు డబ్ల్యూ సి సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు

# హర్ ఘర్ తిరంగా జెండా ఆవిష్కరించిన బీజేపీ మండల అధ్యక్షులు



సుల్తానాబాద్,ఆగస్టు 10(జనంసాక్షి) : హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా భారతీయ జనతా పార్టీ జాతీయ, రాష్ట్ర శాఖల పిలుపు మేరకు ఈరోజు సుల్తానాబాద్ మండల కేంద్రంలో బీజేపీ సుల్తానాబాద్ మండల అధ్యక్షులు కందుల శ్రీనివాస్ పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి భారతీయుడిలో దేశభక్తి, జాతీయతా భావాన్ని మరింత బలోపేతం చేయడమే హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అన్నారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశ సమైక్యత, సమగ్రత, సార్వభౌమత్వాన్ని చాటాలని ఆయన పిలుపునిచ్చారు. దేశం కోసం త్యాగాలు చేసిన స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకుంటూ, జాతీయ జెండాకు గౌరవం ఇవ్వడం ప్రతి భారతీయుడి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సొదరి మహేందర్ యాదవ్, సీనియర్ బిజెపి నేత మిట్టపల్లి ప్రవీణ్ కుమార్,హర్ ఘర్ తిరంగా జిల్లా కో కన్వీనర్ ఉషణ అన్వేష్, కోట నాగేశ్వర్, కొల్లూరి సంతోష్ కుమార్,లంక శంకర్, కొమ్మిడి రాజేందర్ రెడ్డి, మెండే శంకరయ్య,బండారి లత,మల్లా భాగ్యలక్ష్మి,దాసరి వెంకటేష్,పెరక రమేష్, దొంగలశ్రీనివాస్ రెడ్డి,మనోహర్,వలస సాయి కిరణ్ ,కొత్తూరి సంపత్, గుర్రంరమేష్ ,మెంగానికుమార్,మనుపటిబాలకృష్ణ,ప్రశాంత్, ఈశ్వర్, సుబ్బని సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# వీధి కుక్కల స్వైర విహారం



**సిరికొండ ఆగస్టు 10, (జనం సాక్షి )**:సిరికొండ గ్రామంలో వీధి కుక్కల బెడద రోజురోజుకూ తీవ్రంగా మారుతోంది. గ్రామంలోని ఎస్సీ కాలనీ, హెచ్‌పీ పెట్రోల్ బంక్, చర్చి పరిసర ప్రాంతాల్లో పదుల సంఖ్యలో వీధి కుక్కలు గుంపులుగా సంచరిస్తూ స్థానికులను భయాందోళనలకు గురిచేస్తున్నాయి. పగటిపూట రోడ్లపై స్వేచ్ఛగా తిరుగుతున్న కుక్కలు రాత్రివేళల్లో మరింత రెచ్చిపోతున్నాయని స్థానికులు చెబుతున్నారు. గుంపులుగా చేరి పెద్దగా అరుస్తూ, పరస్పరం కొట్లాడుకోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. రాత్రి సమయంలో బయటకు రావాలంటేనే ప్రజలు భయపడుతున్న పరిస్థితి నెలకొంది .ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, రాత్రి విధులు ముగించుకుని ఇళ్లకు వెళ్లే పాదచారులు, ద్విచక్ర వాహనదారులు కుక్కల దాడి ప్రమాదంతో ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడు ఏ కుక్క దాడి చేస్తుందోనని భయపడు తున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ అధికారులు, సంబంధిత శాఖాధికారులు స్పందించి వీధి కుక్కల నియంత్రణకు తగిన చర్యలు చేపట్టి, ప్రజల భద్రతకు భరోసా కల్పించాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# కడుపునొప్పి బాధతో యువకుడి ఆత్మహత్య



**కరీంనగర్ రూరల్, ఆగస్టు 10, ( జనం సాక్షి)**కడుపునొప్పి బాధతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కరీంనగర్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చంద్రాపూర్ కాలనీలో సోమవారం చోటుచేసు కుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తిగలగుట్ట పల్లికి చెందిన గొర్రె మధు (35) కొంతకాలంగా మద్యానికి బానిసై, కడుపునొప్పితో బాధపడుతున్నాడు. చికిత్స తీసుకుంటున్నప్పటికీ నొప్పి తగ్గకపోవడంతో మనస్తాపానికి గురైనట్లు పోలీసులు తెలిపారు. సోమవారం ఉదయం అన్న మనోహర్‌తో కలిసి కూలి పనికి వెళ్లిన మధు.. ఆరోగ్యం బాగాలేదని, కడుపునొప్పి తీవ్రంగా ఉందని చెప్పి ఇంటికి తిరిగి వచ్చాడు. మధ్యాహ్నం ఇంటి పక్కన నివసించే వారు తలుపు నెట్టి చూడగా మధు అపస్మారక స్థితిలో కనిపించడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మధుకు వివాహం కాలేదని, తాను కూడా అవివాహితుడినని, తల్లిదండ్రులు గతంలోనే మృతి చెందడంతో ఇద్దరు అన్నదమ్ములమే ఒకే ఇంట్లో ఉంటూ కూలి పనులు చేసుకుంటున్నామని మృతుడి అన్న మనోహర్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కరీంనగర్ రూరల్ ఇన్‌స్పెక్టర్ ఏ. నిరంజన్ రెడ్డి తెలిపారు.

# స్నానానికి వెళ్లి తిరిగిరాని లోకాలకు



**పెద్ద కొడప్గల్ ఆగస్టు 10 (జనంసాక్షి)**: బిచ్కుంద గ్రామానికి చెందిన మిట్టపల్లి లక్ష్మణ్ (25) ఆదివారం కౌలాస్ వాగులో మునిగి చనిపోయినట్లు పెద్ద కొడప్గల్ ఎస్ఐ అరుణ్ కుమార్ తెలిపారు. ఎస్ఐ సోమవారం తెలిపిన వివరాల ప్రకారం... బిచ్కుంద (పెద్ద కొడప్గల్ ప్రస్తుత నివాసం) కు చెందిన మిట్టపల్లి లక్ష్మణ్ కుటుంబ సభ్యులతో కలిసి మొక్కులు తీర్చుకొనుటకు ఆదివారం చిన్న తక్కడ్పల్లి శివారులోని కౌలాస్ వాగు వద్దకు వెళ్లారు. కుటుంబ సభ్యులు వంటలలో నిమగ్నమై ఉండగా లక్ష్మణ్ స్నానానికి వాగులోకి వెళ్లి ప్రమాదవశాత్తు మునిగి చనిపోయాడు. పెద్ద తక్కడ్పల్లి గ్రామానికి చెందిన వ్యక్తి సహాయంతో నీట మునిగిన స్థలాన్ని వెతికించి శవాన్ని బయటకు తీశారు. అనంతరం కుటుంబ సభ్యులు మృతుడు లక్ష్మణ్ శవాన్ని బాన్సువాడ ప్రభుత్వ ఆసుపత్రికి మార్చురీకి తరలించారు. సోమవారం తల్లి సాయవ్వ (సావిత్రి) ఫిర్యాదు మేరకు శవాన్ని పంచనామా జరిపి పోస్టుమార్టం చేయించినట్లు తెలిపారు.

## జనసేన పార్టీ బహిరంగ ర్యాలీ విజయవంతం



భీంగల్, ఆగస్టు 10(జనం సాక్షి)జనసేన పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం మేరకు నిజామాబాద్ పట్టణంలో నిర్వహించిన జనసేన పార్టీ ఆత్మీయ సమ్మేళనం ,బహిరంగ ర్యాలీకి జనసేన పార్టీ వీర మహిళలు, జన సైనికులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారని భీంగల్ మండల జనసేన పార్టీ ఇంచార్జ్ డాక్టర్ రమావత్ శ్రీకాంత్ పేర్కొన్నారు .ఈ కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర స్థాయి నాయకులు మాట్లాడుతూ, జనసేన పార్టీ అధ్యక్షుడు కొణిదెల పవన్ కళ్యాణ్ ఆశయాలను బాల్కొండ ప్రాంతంలో ప్రజల్లోకి తీసుకెళ్ళి, పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న బాల్కొండ ప్రాంత జనసేన పార్టీ నాయకుడు శివసరి ఫణీంద్రను కొనియాడుతు, వీర మహిళలకు, జన సైనికులకు పార్టీ సిద్ధాంతాలను వివరించి దిశా నిర్దేశం చేశారని తెలిపారు.అలాగే జనసేన పార్టీ అధ్యక్షుడు కొణిదెల పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు జిల్లా నలుమూలల నుండి వీర మహిళలు, జనసైనికులు, అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చారని,బాల్కొండ నియోజకవర్గ జనసేన పార్టీ నాయకుడు శివసరి ఫణీంద్ర సారథ్యం, నిరంతర కృషి, ప్రణాళిక వల్ల ఈ కార్యక్రమం విజయవంతం అయ్యిందని భీంగల్ మండల జనసేన పార్టీ ఇంచార్జ్ డాక్టర్ రమావత్ శ్రీకాంత్ తెలిపారు.

## జిల్లా ఉప సర్పంచ్ ల ఫోరం



జగిత్యాల ఆగస్టు10(జనం సాక్షి)కథలాపూర్ మండల కేంద్రానికి చెందిన ఉప సర్పంచ్ చెట్ పల్లి ప్రసాద్ గారిని జగిత్యాల జిల్లా ఉప సర్పంచ్ ల ఫోరమ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రాష్ట్ర అధ్యక్షులు బొట్ల కార్తీక్ గారు ఈరోజు నియమించడం జరిగింది. జిల్లా స్థాయిలో ఉపసర్పంచుల ఐక్యతకు సమస్యల పరిష్కరణకు కృషి చేస్తానని చెట్ పల్లి ప్రసాద్ తెలియ జేశాడు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ముత్యాల స్వామి, రాష్ట్ర ఉపాధ్యక్షులు గనవేణి నందిని మల్లేష్, రాష్ట్ర కార్యదర్శి మెరుగు జంపన్న, కథలాపూర్ మండల అధ్యక్షుడు అన్నారపు నర్సయ్య, వివిధ గ్రామాల ఉప సర్పంచులు పాల్గొన్నారు.

## పర్యావరణ వేత్త వర్ధినేని రవీందర్‌రావుకు ఘన సన్మానం



హుజూరాబాద్, ఆగస్టు 10 (జనం సాక్షి) : పర్యావరణ వేత్త, సామాజిక కార్యకర్త, మున్సిపల్ కౌన్సిలర్ వర్ధినేని రవీందర్ రావును సోమవారం ప్రజా సంఘాలు,అంబేద్కర్ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఆలిండియా అంబేద్కర్ సంఘం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహాసేన, బీసీ ఆజాద్ ఫెడరేషన్, ఆర్టీఐ, హ్యూమన్ రైట్స్, చేనేత సంఘాల ప్రతినిధులు వర్ధినేని రవీందర్‌రావు అందిస్తున్న సేవలను అభినందిస్తూ శాలువాలతో సత్కరించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుత ..బాబాసాహెబ్ అంబేద్కర్ "పే బ్యాక్ టు సొసైటీ" సిద్ధాంతాన్ని స్ఫూర్తిగా తీసుకొని రవీందర్‌రావు సమాజసేవ చేస్తున్నారని కొనియాడారు. ఎందరో పేద విద్యార్థులకు విద్య, ఉపాధి అవకాశాల కోసం ఆర్థిక సాయం అందించడంతో పాటు మొక్కలు నాటుతూ పర్యావరణ సమతుల్యతకు కృషి చేస్తున్నారని ఆయన సేవలను ప్రశంసించారు. భవిష్యత్తులోనూ పేద వర్గాల అభ్యున్నతికి ఆయన సేవలు కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహాసేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కోదూరి సమ్మయ్య, డివిజన్ అధ్యక్షుడు రామగిరి అంకుస్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ బాబు, బీసీ ఆజాద్ ఫెడరేషన్ నాయకుడు చిలుకమూరి శ్రీనివాస్, పద్మశాలి సంఘం నాయకుడు సంజు సత్య నారాయణ, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కాయిత రాములు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ తడికమళ్ళ శేఖర్, బీసీ సంక్షేమ సంఘం మహిళా జనరల్ సెక్రెటరీ ప్రియదర్శిని, ఆర్టీఐ చట్టం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లూరు రాజేందర్, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు రుద్రారపు రామచంద్రం, శ్రీనివాస్, వసంత్, తెలంగాణ అంబేద్కర్ సంఘం నాయకుడు తునికి సమ్మయ్య, చేనేత ఐక్యవేదిక ఉపాధ్యక్షురాలు బింగి రాణి, సృజన, చల్లూరు నిరోషా, షాదిక్ తదితరులు పాల్గొన్నారు.

## దశలవారీగా అభివృద్ధి పనులన్నీ పూర్తి చేస్తాం



గోదావరిఖని, ఆగస్టు 10 జనంసాక్షి :ముప్పయి ఐదవ డివిజన్ సప్తగిరి కాలనీ , రాజ్య లక్ష్మీ కాలనీలలో దశలవారీగా అభివృద్ధి పనులన్నీ పూర్తి చేస్తున్నామని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. సోమవారం 35 వ డివిజన్ రాజ్య లక్ష్మీ కాలనీలో రూ. 7.00 కోట్ల స్పెషల్ ఫండ్ ప్యాకేజీ పనుల్లో భాగంగా రూ 8.00 లక్షల అంచనా వ్యయంతో ప్రతిపాదించిన సి సి రోడ్డు నిర్మాణపనులను స్థానిక కార్పొరేటర్ జంగపల్లి రమాదేవి శ్రీనివాస్ తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎం ఎల్ ఏ రాజ్ ఠాకూర్ తాను గెలిచిన వెంటనే ఇచ్చిన మాట ప్రకారం రాజ్యలక్ష్మి కాలనీ, సప్తగిరి కాలనీ వర్షా కాలంలో ముంపుకు గురి కాకుండా వరద నీటి కాలువ నిర్మించడం జరిగిందని అన్నారు. కొత్తగా ఏర్పడిన కాలనీ కావడంతో సరైన డ్రైనేజి వ్యవస్థ లేక మురుగునీరు రోడ్లపై పారేదని అన్నారు. ప్రస్తుతం డ్రైనేజి నిర్మాణశీ పూర్తయిందని ఎం ఎల్ ఏ ఆదేశాల మేరకు రూ 50.00 లక్షల అంచనా వ్యయంతో రాజ్యాలక్ష్మీ కాలనీ లో రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని అన్నారు. ఇటీవల తాను డివిజన్ లో వార్డు సందర్శన కార్యక్రమం చేపట్టి సమస్యలు గుర్తించామని ఒక్కటొక్కటిగా అన్ని సమస్యలు సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దాసరి సాంబమూర్తి, దేవిడ్ రాజు, స్థానిక నాయకులు గడ్డం శ్రీనివాస్, పీచర శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా హర్ ఘర్ తిరంగా అభియాన్



కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 10 (జనంసాక్షి) : కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా సోమవారం రోజున హర్ ఘర్ తిరంగా అభియాన్ ప్రోగ్రాం ఘనంగా ప్రారంభమైంది .కార్యక్రమంలో భాగంగా సోమవారం రోజున బిజెపి జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం తన స్వగృహం పై కుటుంబ సభ్యుల తో కలిసి జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా సాయిని మల్లేశం మాట్లాడుతూ మన జాతీయ పతాకం దేశానికి , మనందరికీ గర్వకా రణమని, దేశభక్తిని కలిగే విధంగా నిరంతర ప్రేరణ శక్తిని ఇస్తుందని తెలిపారు. 2022 నుండి కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' (ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం) కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా భాగస్వాములు కావాలని ఆయన పిలుపు నిచ్చారు. ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవం సందర్భ ంగా ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల పై జాతీయ జెండాను ఎగురవేసి, 'వికసిత భారత్' నిర్మాణానికి మద్దతుగా నిలిచి, మనందరి ఐక్యతను చాటి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిజెపి నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## హర్ ఘర్ తిరంగా యాత్రలో భాగంగా జాతీయ జెండా ఆవిష్కరణ



8వ కాలనీఆగస్ట్ 10 (జనంసాక్షి భారతీయ జనతా పార్టీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగా యాత్రలో భాగంగా 8వ కాలనీ మండల బీజేపీ శాఖ ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. 8వ కాలనీ బిల్డింగ్ డిపార్ట్మెంట్ మురళి చౌక్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో 8వ కాలనీ మండల అధ్యక్షుడు ఆకుల శశికుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి ఒక్కరిలో దేశభక్తి, జాతీయ ఐక్యతా భావాన్ని పెంపొందించ చేందుకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ముకిరి రాజు, ఆకుల కుమార్ గౌడ్, మహిళా నాయకురాలు జనగామ సుజాశ్రీ, నాగ శ్రీనివాస్, తిరంగా యాత్ర మండల కన్వీనర్ అయిలవేణి అనిల్ కుమార్, లింగం నాయక్, జంజర్ల శ్రీనివాస్, మైనార్టీ నాయకులు ఎస్కే పాషా, చొప్పరి స్వామితో పాటు సూర్యప్రకాష్, గంధం శంకర్, మంద సాయి, ప్రణీత్, అఖిల్ గౌడ్, రవీందర్, జితేంద్ర, అభిరామ్, శివ, సాయి, రంజిత్, విక్కీ, గణేష్, అనిరుద్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల హామీలను అమలు చేయాలి



సిరిసిల్ల టౌన్ ఆగస్టు 10(జనంసాక్షి)తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని భారత రాష్ట్ర సమితి పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి గజ్జెల దేవరాజ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన తెలంగాణ ఉద్యమకారుల రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. ఉద్యమకారులకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన 250 గజాలస్థలం , ఉచితబస్ పాస్, ఫించన్ రూ. 25వేలు, ప్రభుత్వ , ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఉచిత వైద్య సేవలు, తదితర హామీల అమలుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఉద్యమకారుల గుర్తింపు కోసం ఏర్పాటుచేసిన కమిటీని స్వాగతిస్తున్నామన్నారు. సెప్టెంబర్ 17 లోగా హామీలన్నింటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## గడ్కోల్‌లో ఘనంగా మొక్కలు నాటే కార్యక్రమం



సిరికొండ, ఆగస్టు 10 (జనం సాక్షి) :సిరికొండ మండలం గడ్కోల్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో సోమ వారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహి ంచారు. గ్రామ సర్పంచ్ లత శంకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ లత శంకర్ మాట్లాడుతూ గ్రామంలో పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని కోరారు. పర్యావరణ పరిరక్షణతో పాటు భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు మొక్కల పెంపకం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రెడ్డి వేల్పూర్ గంగారెడ్డి, పాలకవర్గ సభ్యులు అరిగెల సావిత్రి, కోమటి గంగాధర్, తలారి హేమంత్, గంభీరావుపేట అఖిల్‌తో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ



**ఇల్లందకుంట, ఆగస్టు 10 (జనం సాక్షి)**దేశభక్తి, జాతీయ సమైక్యతను చాటుతూ భారతీయ జనతా పార్టీ ఇల్లందకుంట మండల ప్రధాన కార్యదర్శి గుత్తికొండ రాంబాబు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు చేతుల్లో జాతీయ జెండాలను పట్టుకుని భారత్ మాతాకీ జై, వందే మాతరం అంటూ దేశభక్తి నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు గుత్తికొండ రాంబాబు మట్ట పవన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తి భావనను చాటాలని, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించు కోవాలని పిలుపునిచ్చారు. దేశ ఐక్యత, అఖండత, సార్వభౌ మత్వాన్ని కాపాడుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత అని పేర్కొన్నారు. 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని ప్రతి ఇంటికి తీసుకె ళ్లేలా బీజేపీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలోగుత్తికొండ రాంబాబు ఉప్పుల రమేష్, ఇంగ్లే ప్రభాకర్,మట్ట పవన్ రెడ్డి, ఏనుగు సురేందర్ రెడ్డి, తుపాకుల సతీష్, ఉప్పు దుర్గయ్య, సోమిడి సురేందర్, చింతల ఐలయ్య, సామల కర్ణాకర్ రెడ్డి, జిల్లెల శ్రీపాల్ రెడ్డి, మద్దూరి మల్లేష్, అసాలా సుధాకర్,చదువు సాయి రెడ్డి, చిట్ల శ్రీనివాస్, మురహరి గోపాల్, రావుల అశోక్,ఎలేవేని శ్రీధర్,పిట్టల రాజు బోయిని శివకృష్ణ, చిలుక రాజు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పెన్షన్ ల ఫారాలను అందించిన కాంగ్రెస్ నాయకులు

**బోధన్, ఆగస్టు 10 ( జనంసాక్షి ) :** పంద్రాగస్టు నాడు ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్టాత్మకమైన సంక్షేమ పథకా లలో ప్రధాన మైన పెన్షన్ల పంపిణీ కొరకు అర్హులు గత ఐదు ఆరు సంవ త్సరాల నుంచి ఎదురు చూస్తున్నారు. మంజూరు కొరకు గతంలో దరఖాస్తు చేసిన ప్రొఫార్మా



మారినందున ప్రభుత్వం కొత్తగా ఇచ్చిన నమూనా ఫారం దరఖాస్తు ఫారాలను కాంగ్రెస్ నాయకులు అధికారులకు అందించారు. ఈ కొత్త దరఖాస్తును గ్రామపంచాయతీలో ఇచ్చుటకు నిరుపేదలకు దరఖాస్తు ఫారం తేవాలన్న ఇబ్బంది అవుతుందని గ్రామ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సుందర్ రాజు ఆధ్వర్యంలో ఫారములు తెచ్చి కార్యకర్తలు అందరం కలిసి లబ్ధిదారులు సహకరించి గ్రామ పంచాయతీలో సమర్పించారు. ఈ కార్యక్రమంలో సుందర్ రాజు, వైట్ల శ్రీనివాసరావు, జిపి వార్డ్ నెంబర్లు షేక్ మజార్ అలీ, పులి అంజి, గ్రామ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి యపారు బలరాం, యువ నాయకుడు మల్లవరపు కౌటిల్య, భీమ్ శెట్టి పవన్. రైతు వేదికలో పాల్గొన్నారు.

### ఎడపల్లి గ్రామ గౌడ సంఘం నూతన కమిటీ ఎన్నిక



**ఎడపల్లి, ఆగస్టు 10 ( జనంసాక్షి ) :** ఎడపల్లి గ్రామ గౌడ కౌండిన్య గౌడ సంఘం నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా ఆర్. ఎల్లా గౌడ్, అధ్యక్షులుగా కే. దయానంద్ గౌడ్, ఉపాధ్యక్షులుగా అంకుల్ సాయి గౌడ్, ప్రధాన కార్యదర్శిగా కందునూరి నవీన్ గౌడ్, కోశాధికారిగా ఎం. శేఖర్ గౌడ్, ప్రధాన సలహాదారు ఎం నటరాజ్ గౌడ్ సలహా సభ్యులుగా లక్ష్మీ నరస గౌడ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు సంఘం అభివృద్ధికి, గౌడ సంఘం సభ్యుల సంక్షేమానికి కృషి చేస్తామని తెలిపారు.

# ఇందుర్తి గ్రామపంచాయతీకి ఫ్రీజర్ బహూకరణ

**చిగురుమామిడి ఆగస్టు 10 (జనంసాక్షి):** మండలంలోని ఇందుర్తి గ్రామపంచాయతీకి గుణుకులపల్లి గ్రామానికి చెందిన చిట్యాల బాల్ రెడ్డి తన తండ్రి పుల్లారెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారుడు సీనియర్ కాంగ్రెస్ నాయకుడు చిట్యాల బాల్ రెడ్డి 65వేల విలువైన శవపేటికను బహూకరించారు. ఈ సందర్భంగా దాత చిట్యాల బాల్ రెడ్డిని అభినందిస్తూ గ్రామ సర్పంచ్ చింతపూల నరేందర్,వార్డు సభ్యులు షేక్ ఉమ్మర్,అందె బాబు పాలకవర్గ సభ్యులు శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కోసం దాతలు మరింత మంది ముందుకు రావాలని,ప్రజల అవసరాల కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. శవపేటికను వినియోగించుకునే వారికి రోజుకు వెయ్యి రూపాయల చొప్పున రుసుము నిర్ణయించినట్లు



తెలిపారు. అదేవిధంగా ఇందుర్తి గ్రామానికి వైకుంఠ రథం అందించేందుకు కూడా దాతలు ముందుకు రావాలని,గ్రామ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అందె సురేష్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కోసం దాతలు,పెద్దలు ముందుకు వచ్చి తమ వంతు సహకారం అందించాలని పిలుపుని చ్చారు. ప్రజా సేవలో భాగస్వాములై గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని కోరారు. తండ్రి జ్ఞాపకార్థం ఇందుర్తి,గునుకులపల్లె గ్రామ ప్రజలకు ఉపయోగపడేలా శవపేటికను అందించిన చిట్యాల బాల్ రెడ్డి ని సేవాభావాన్ని గ్రామ ప్రజలు అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పుల్లూరి రాజు,కాంగ్రెస్ సీనియర్ నాయకులు చింతపుల సాయన్న, డాక్టర్ రాజేందర్, కూనచ్చుల బాలయ్య,కొడకండ్ల సాంబమూర్తి,విశ్వపతి లింగమూర్తి, పులి మల్లయ్య, పులి శ్రీను,బుర్ర లక్ష్మణ్, ఎనూరు అందె సదానందం, కిరణ్,కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బోధన్ పట్టణంలో జైల్ భరో విజయవంతం

**బోధన్, ఆగస్టు 10 ( జనంసాక్షి ) :** బోధన్ పట్టణంలో వామపక్ష పార్టీల కార్మికా, కర్షక, వ్యవసాయ కార్మిక సంఘాల పిలుపు రాస్తారోఖో, జైల్ భరో లో భాగంగా టీ యూ సీ ఐ, సీ ఐ టీ యూ, ఐ ఎఫ్ టీ యూ, అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం, అఖిలభారత ఐక్య రైతు సంఘం, వికలాంగుల హక్కుల జాతీయ వేదిక తదితర సంఘాల ఆధ్వర్యంలో బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుండి రైల్వే గేట్ వరకు ర్యాలీగా వెళ్లి రాస్తారోకో నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తుండగా బోధన్ పట్టణ ఎస్ హెచ్ ఓ ఆధ్వర్యంలో పోలీసు బలగాలు వచ్చి రాస్తారోకో చేస్తున్న వారిని బలవ ంతంగా ఈడ్చుకుంటూ పోలీసు జీబులో ఎక్కించి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సంద ర్భంగా టీ యూ సీ ఐ రాష్ట్ర నాయకులు బి. మల్లేష్, సిఐ టి యు జిల్లా అధ్యక్షులు జే. శంకర్ గౌడ్, ఐఎఫ్ టి యు జిల్లా అధ్యక్షులు పి. వరదయ్య, వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఏషాల గంగాధర్ లు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ



ప్రభుత్వం కార్మిక, కర్షక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను అనుస రిస్తున్నదని ముఖ్యంగా నేడు మోడీ నాయకత్వంలో అమెరికాతో చేసుకున్న స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందం ఇది దేశ ప్రజాధికానికి తీవ్రంగా నష్టం చేకూర్చే ఒప్పందం అని దీన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని అట్లాగే బడా పారిశ్రా అమికవేత్తలకు మేలు చేయడానికి తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని, దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను బడా కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పడాన్ని మానుకోవాలని, ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేసి, కాంట్రాక్టు అవుట్సోర్సింగ్ రంగాలలో పనిచేస్తున్న కార్మికు లందరినీ పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని అప్పటివరకు వారు జీవించడానికి సరిపడా కనీసం 39వేల వేతనం చెల్లించాలని, ఈపీఎఫ్ కార్మికులకు ఇచ్చేటటువంటి పెన్షన్ కనీసం పదివేల రూపాయలు ఇవ్వాలని, రైతాంగం పంటలకు వారికి అయ్యే ఖర్చు పైన 50 శాతం లాభం అచ్చేటట్లు నిర్ణయించి చెల్లించాలని తదితర డిమాండ్లను వెంటనే పరిష్కరి ంచాలని లేనట్లయితే మళ్లీ పెద్ద ఎత్తున దేశవ్యాప్తంగా కార్మిక కర్షక ప్రజానీకం తో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనకు పూనుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత ఐక్య రైతు సంఘం జిల్లా నాయకుడు పడాల శంకర్, అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు సిహెచ్ రమేష్, ప్రగతిశీల మహిళా సంఘం పట్టణ అధ్యక్షురాలు బి.నాగమణి, టి యు సి ఐ నాయకులు డి పోశెట్టి, సిఐటియు నాయకులు జంగం గంగాధర్, సాగర్, పోశెట్టి, ఐ ఎఫ్ టి యు నాయకులు దాల్ మల్కా పోశెట్టి,మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు బి. పర్వయ్య,యు.శివ, అబ్బయ్య, మరియమ్మ, మక్కయ్య,పోశెట్టి, అంగన్వాడీ టీచర్లు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పీజీ ప్రవేశ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ

**కరీంనగర్ టౌన్, ఆగస్టు 10, ( జనం సాక్షి)**పీజీ ప్రవేశ పరీక్ష వృక్షశాస్త్ర ఉచిత ఆన్‌లైన్ శిక్షణ సమన్వయకర్త డాక్టర్ పడాల తిరుపతిని తెలంగాణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల గెజిటెడ్ అధ్యాపకుల సంఘం ఆధ్వర్యంలో ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఘనంగా సన్మానించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కడారు సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు .కాకతీయ విశ్వవిద్యాలయం నిర్వహించిన పీజీ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ఉచిత ఆన్‌లైన్ శిక్షణ పొందిన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటారు. 65 రోజుల పాటు నిర్వహించిన శిక్షణ ద్వారా రాష్ట్రస్థాయి మొదటి పది ర్యాంకుల్లో మొదటి, రెండో, మూడో, ఐదో, పదో ర్యాంకులు సాధించడంతో పాటు మరో 32 మంది విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. డాక్టర్ పడాల తిరుపతి మాట్లాడుతూ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కడారు సురేందర్‌రెడ్డి సూచనలు, అధ్యాపకుల సహకారంతోనే విద్యార్థులు ఈ విజయాలు సాధించారని తెలిపారు. గత ఆరేళు




ల్లుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సహకారంతో ఉచిత ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, గురుకుల కళాశాలలు, స్వయం ప్రతిపత్తి కళాశాలల విద్యార్థులతో పాటు ఓపెన్ విశ్వవిద్యాలయం ద్వారా డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతోందన్నారు. కార్యక్రమంలో జిల్లా సంఘం అధ్యక్షుడు డాక్టర్ మామిడిపల్లి సత్యప్రకాశ్, కార్యదర్శి డాక్టర్ గోపు శ్రీనివాస్‌రెడ్డి, వృక్షశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ తిరుక్కోవేల శ్రీనివాస్, డాక్టర్ తాండ్ర కరుణాకర్, డాక్టర్ ఎడేళ్ల నారాయణ తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

# రోడ్డు వేయకుంటే రాజీనామా చేయి



**గన్నేరువరం, ఆగస్టు 10 (జనంసాక్షి):**గన్నేరువరం రోడ్ల నిర్మాణంపై రాజకీయం వేడెక్కింది. గన్నేరు వరం మండలం గుండ్లపల్లి నుండి ఇల్లంత కుంట మండలం పొత్తూరు వరకు బీటీ డబుల్ రోడ్డు నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ గన్నేరువరం మండల బీజేపీ నాయకులు గుండ్లపల్లి వద్ద రాజీవ్ రహదారిపై బైఠాయించి పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి,స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనాంయణకు వ్యతిరేకంగా తీవ్ర నినాదాలు చేశారు. చేతకానితనంతోనే రోడ్డు నిర్మాణాలు గాలికొదిలే శారని, దమ్ముంటే ఎమ్మెల్యే తన పదవికి రాజీనామా చేయాలని బీజేపీ నేతలు ఘాటుగా సవాల్ విసిరారు. "ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇదే రోడ్డు కోసం నానా యాగీ చేసిన కవ్వంపల్లి సత్యనారాయణ.. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక ఎందుకు నోరుమెదపడం లేదు? ప్రజల సంక్షేమం గాలికొదిలేసి కేవలం స్వలాభం కోసమే ఎమ్మెల్యే పాకులాడుతున్నారు." అని నేతలు మండిపడ్డారు. అల్టిమేటం జారీ..వచ్చే నెల రోజుల్లోగా బీటీ డబుల్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిం చకపోతే, నియోజకవర్గ వ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని అధికార పార్టీకి,ఎమ్మెల్యేకు బీజేపీ నాయకులు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఈ ఆందోళన కారణంగా రాజీవ్ రహదారిపై కొంతసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది .ఈకార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేశ్, మానకొండూరు నియోజకవర్గం అసెంబ్లీ కన్వీనర్ ముత్యాల జగన్ రెడ్డి, గునుకుల కొండాపూర్ సర్పంచ్ సొల్లు అజయ్ వర్మ, బిజెపి రాష్ట్ర మాజీ కౌన్సిల్ మెంబర్ విలాసాగరం రామచంద్రం, బీజేపీ జిల్లా సీనియర్ నాయకులు ఏలేటి చంద్రారెడ్డి, కిసాన్ మోర్చా మాజీ జిల్లా అధ్యక్షుడు అన్నాడి రాజిరెడ్డి, గన్నేరువరం వార్డు సభ్యులు మచ్చ సాయి కృష్ణ,బీజేపీ మండల నాయకులు సందవేణి ప్రశాంత్, పార్టీ నాయకులు కార్యకర్తలు వివిధ గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## కొండూరు కప్పలవాగు బ్రిడ్జికి మరమ్మతులు



**సిరికొండ, ఆగస్టు 10 (జనం సాక్షి):**భారీ వర్షాలకు దెబ్బతిన్న సిరికొండ మండలం కొండూరు కప్పలవాగు బ్రిడ్జి వద్ద మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయి. గత వారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి బ్రిడ్జిని పరిశీలించి, ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా తక్షణమే పునరుద్ధరణ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.కప్పలవాగు బ్రిడ్జి సిరికొండ మండల కేంద్రం, కొండూరు, న్యావనంది, రావుట్ల, మైలారం, చీమన్ పల్లి, హుస్సేన్ నగర్ గ్రామాల ప్రజలకు జిల్లా కేంద్రం నిజామాబాద్‌కు చేరుకోవడానికి ప్రధాన మార్గంగా ఉంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో బ్రిడ్జి వద్ద రహదారి కోతకు గురై రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.ప్రస్తుతం జేసీబీల సహాయంతో దెబ్బతిన్న ప్రాంతాల్లో రాళ్లు వేసి పునర్నిర్మాణం చేసి, అనంతరం మొరం పోసి రహదారిని పునరుద్ధరిస్తామని కాంట్రాక్టర్ తెలిపారు. పనులు త్వరగా పూర్తి చేసి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేస్తామని పేర్కొన్నారు.ప్రతి ఏడాది వర్షాకాలంలో కప్పలవాగు ఉధృతంగా ప్రవహించడంతో ఈ ప్రాంతంలో రాకపోకలు నిలిచిపోతున్నాయని గ్రామస్తులు తెలిపారు. తాత్కాలిక మరమ్మతులతో పాటు భవిష్యత్తులో సమస్య తలెత్తకుండా బ్రిడ్జికి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

# చదువుకున్న బడికి తిరిగి వచ్చి జ్ఞాపకాల ఒడిలో మునిగిపోయిన..




**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 10( జనం సాక్షి)**తాను విద్యనభ్యసించిన పాఠశాలను ఎన్నేళ్లు గడిచినా మరచి పోకుండా, అదే పాఠశాల అభివృద్ధికి కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయించి ఆదర్శంగా నిలిచారు కామారెడ్డి ముద్దు బిడ్డ, మాజీ మంత్రి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్.కామారెడ్డి జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించిన షబ్బీర్ అలీ, పాత భవనాన్ని చూసి భావోద్వేగానికి గురయ్యారు. తాను 1971లో విద్యనభ్యసించిన తరగతి గదిలో కొద్దిసేపు కూర్చొని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువే సుకున్నారు. తాను చదువుకున్న రోజుల నాటి ఉపాధ్యా యులు, స్నేహితులు పాఠశాల ప్రాంగణంతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.రూ.5 కోట్లతో ఆధునిక పాఠశాలగా రూపాం తరంతాను చదువుకున్న పాఠశాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న షబ్బీర్ అలీ ముఖ్యమంత్రి దృష్టికి పాఠశాల అవసరాలను తీసుకెళ్లి రూ.5 కోట్ల అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించారు పాత భవనాన్ని తొలగించి ఆధునిక వసతులతో నూతన పాఠశా లను నిర్మిం చేందుకు చర్యలు కొనసాగుతున్నాయి.విద్యార్థులకు ఆధునిక విద్యా ప్రమాణాలకు అనుగుణంగా అత్యాధునిక ల్యాబొరేటరీలు కంప్యూటర్ ల్యాబ్‌లు, డిజిటల్ తరగతి గదులు, ఇతర విద్యా సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో పనులు చేపడు తున్నారు అవస రమైన చోట తన సొంతంగా కూడా సహకరి స్తున్నట్లు షబ్బీర్ అలీ తెలిపారు.పూర్వ విద్యార్థులతో ఆత్మీయ సమ్మేళనం ఈ సందర్భంగా పాఠశాలలో పూర్వ విద్యార్థులతో షబ్బీర్ అలీ ఆత్మీయంగా సమావేశమయ్యారు. తనతో కలిసి చదువుకున్న మిత్రులను ఏళ్ల తర్వాత అదే పాఠశాల ప్రాంగణంలో కలుసు కోవడం మరపురాని అనుభూతిగా ఉందన్నారు చిన్ననాటి అనుభవాలు, పాఠశాలలో గడిపిన రోజులు ఉపాధ్యాయులు, స్నేహితులతో ఉన్న అనుబంధాలను గుర్తుచేసుకుంటూ వారితో ముచ్చ టించారు."ఈ బడి నాకు కేవలం ఒక విద్యాల యం కాదు.నా జీవితానికి పునాది వేసిన ప్రదేశం. ఇక్కడి నుంచే నా ప్రయాణం ప్రారంభమైంది భవనం మారుతుంది కానీ ఈ బడి నాకు ఇచ్చిన జ్ఞాపకాలు మాత్రం ఎప్పటికీ మారవు" అని షబ్బీర్ అలీ భావోద్వేగంగా పేర్కొన్నారు.తాను చదివిన పాఠశాల అభివృద్ధికి రూ.5 కోట్ల నిధులు తీసుకురావడంతో పాటు, భవిష్యత్ విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేయడంపై పూర్వ విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు చదువు నేర్పిన బడికి రుణం తీర్చుకోవాలనే గొప్ప మనసుకు షబ్బీర్ అలీ కృషి నిదర్శనమని వారు అభినందించారుఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఉమారాణి శ్రీనివాస్ గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, కైలా శ్రీనివాస్ మహమ్మద్ ఇలియాస్ పండ్ల రాజు పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు నిర్మాణం చేపట్టాలని బీజేపీ డిమాండ్



**ఇల్లంతకుంట జూలై 10(జనంసాక్షి )** సోమవారం రోజున పెద్దలింగపూర్ గ్రామంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పెద్దలింగపూర్ నుండి అనంతగిరి పోచమ్మ ఆలయం వరకు రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు భూమల్ల అనిల్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రోడ్డు నిర్మాణం హామీలు ఇచ్చి ప్రభుత్వం లోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు అవుతుందన్నారు. అలాగే పోచమ్మ ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని స్థానిక ఎమ్మెల్యే హామీ ఇచ్చారు అన్నారు. ఎమ్మెల్యే హామీలను గాలికి వదిలేసి, ముఖం చాటేశారు అని అన్నారు. ప్రస్తుత వర్షాలకు రోడ్డు అధ్వానంగా తయారయిందని ఈ సందర్భంగా తెలియజేశారు. పోచమ్మ ఆలయానికి వచ్చే భక్తులకు, వ్యవసాయ పనులకు వెళ్లే కూలీలకు రోడ్డు ఇబ్బంది కరంగా మరిందన్నారు. ఆర్టీసీ బస్సు ప్రయాణికులు విద్యార్థులు కూడా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఈ సందర్భంగా తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆలయాభివృద్ధికి, రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించాలని భారతీయ జనతా పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నామని అన్నారు. రోడ్డు మరమ్మతులు పనులకు చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు లచ్చయ్య మండల కార్యవర్గ సభ్యులు పయ్యావుల బాలయ్య, కునవేని అనిల్, పలుమారి రవి, సీనియర్ నాయకులు అమ్ముల అశోక్, రెడ్డి ముత్యం రెడ్డి నాయకులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఆగస్టు 13న జరిగే రైతు సమ్మేళనాన్ని విజయవంతం చేయండి




**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 10 జనం సాక్షి** :సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీ తెరిపించాలని డిమాండ్ తో ఈ నెల 13 గురువారం ఫ్యాక్టరీ ఆవరణంలో జరిగే రైతు సమ్మేళనాని కి రైతులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని చెరుకు ఉత్పత్తిదారుల సంఘం కన్వీనర్ ఆకుల పాపయ్య అన్నారు.సోమవారం సాయి నగర్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాపయ్య మాట్లాడుతూ ఎల్ ని నో ప్రభావంతో ప్రభుత్వం ఆరుతడి పంటలకు రైతులను వెళ్ళమంటున్నందున చెరుకు పంట ఆరుతడి పంటేనని ప్రభుత్వం సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీని తెరిపిస్తామని రైతులకు భరోసా కల్పించినట్లయితే రైతులంతా చెరుకు పండించేందుకు సిద్ధంగా ఉన్నారని వారన్నారు. ఈ ఫ్యాక్టరీలో 117 గ్రామాల రైతులకు గతంలో చెరుకు పండించిన అనుభవం ఉందని రెండో పంటగా చెరుకు పెట్టేందుకు సుమారు 40 గ్రామాల రైతులు ముందుకు వస్తున్నారని వారన్నారు. దేశంలో బెల్లానికి మంచి డిమాండ్ ఉన్నందున ఈ ఫ్యాక్టరీని బెల్లం కేంద్రంగా మార్చి ప్రభుత్వమే నడపాలని వారు డిమాండ్ చేశారు. గత ప్రభుత్వాలు చక్కెర ఫ్యాక్టరీలను తెరిపిస్తామని హామీ ఇచ్చి రైతులను మోసం చేశారని మీరు కూడా పాత ప్రభుత్వాల దారిలో నడవకుండా రైతులకు చెప్పిన మాటకు కట్టుబడి ఫ్యాక్టరీ తెరిపిం చాలని డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీ తెరిపించేందుకుగాను రైతులంతా ఐక్యమై బలమైన రైతు ఉద్యమాన్ని నిర్మించుకునేందుకు ఈ రైతు సమ్మేళనంలో తగిన ప్రణాళికలు కర్తవ్యాలు రూపొందించుకుందామని, అందుకు రైతులు అధిక సంఖ్యలో హాజరుకావాలని వారు కోరారు.ఈ సమావేశంలో ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య,సిర్పూర్ గంగారెడ్డి, కొట్టే గంగాధర్, టేక్మాల్ లక్ష్మణ్, తుంగపల్లి రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బైక్ ఎక్స్ఎల్ ఢీ ఇద్దరికి తీవ్ర గాయాలు



**సిరికొండ ఆగస్టు 10 (జనం సాక్షి):** సిరికొండ మండలం తాళ్ల రామడుగు గ్రామ పరిధిలోని రామాలయం సమీపంలో ఆదివారం బైక్ ఎక్స్ఎల్ వాహనం ఢీకొన్న ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో గడ్కోల్‌కు చెందిన రాజు పల్లికొండ నర్సయ్య తీవ్రంగా గాయపడ్డారు .స్థానికుల వివరాల ప్రకారం రాజు బైక్‌పై వెళ్తుండగా పల్లికొండ నర్సయ్య ఎక్స్ఎల్ వాహనంపై వస్తున్న సమయంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ఇద్దరూ రోడ్డుపై పడిపోయి తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంతో కొద్దిసేపు రోడ్డుపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం



**కమ్మర్పల్లి ఆగస్టు 10(జనంసాక్షి)** కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నరేందర్ అన్నారు.సోమవారం రోజున కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నరేందర్ మాట్లాడుతూ బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాజారామ్ యాదవ్ అనవసరంగా కాంగ్రెస్ పార్టీ నాయకుల పైన విమర్శలు చేస్తున్నారని,తన సొంత మండలమైన ఏర్గట్లలో ఐదు సంవత్సరాలు మంత్రిగా ఉన్న ప్రశాంత్ రెడ్డి ఎంతమంది పేద ప్రజలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇచ్చారో చెప్పలన్నారు.మండలశీలో ఎలాంటి అభివృద్ధి చేయలేదని అన్నారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నుండి నియోజకవర్గ ఇన్చార్జ్ ముత్యాల సునీల్ ఆధ్వర్యంలో నియోజకవర్గం ఎంతో అభివృద్ధి పథంలో నడుస్తుందని ఎర్గట్ల  మండలంలోని తాళ్ళ రాంపూర్ గ్రామానికి 30 మందికి ఇందిరమ్మ ఇల్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని గుర్తు చేశారు. అనవసరంగా కాంగ్రెస్ పార్టీ నాయకుల పైన, పార్టీ పైన అసత్య ప్రచారాలు చేయకూడదని కోరారు.ఈ కార్యక్రమంలో బాల్కొండ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు రిత్విక్,సోషల్ మీడియా కోఆర్డినేటర్ సాయి,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అజ్మిత్ పాషా,యూత్ కాంగ్రెస్ నాయకులు వేములవాడ జగదీశ్,నాయకులు క్రాంతి,అరవింద్,ముఖీమ్, ఉబెదు,ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర సమరయోధుల పోరాట స్ఫూర్తితో హర్ ఘర్ తిరంగా



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి ఆగష్టు10(జనంసాక్షి):**స్వాతంత్ర సమరయోధుల పోరాట స్ఫూర్తితో దేశ ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు ప్రతి ఒక్కరు తమ ఇంటిపై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ పిలుపు నిచ్చారు. సోమవారం మిర్చి కంపౌండ్ లో గల తన ఇంటిపై జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రతి సంవత్సరం మాదిరిగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడం జరిగిందన్నారు.

# టోల్ ప్లాజా యాజమాన్యం తీరుపై షాపుల నిర్వాహకుల ఆవేదన



**ఇందల్వాయి ఆగస్టు 10( జనం సాక్షి )** ఇందల్వాయి మండల పరిధిలోని టోల్ ప్లాజా యాజమాన్యం తీరుపై ఇరుపక్కల గ్రామాలకు చెందిన షాపుల నిర్వాహకులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చదువుకున్నప్పటికీ ఉద్యోగ అవకాశాలు లభించక, కుటుంబ పోషణ కోసం టోల్ ప్లాజా సమీపంలో షాపులు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నామని వారు వాపోతున్నారు.ఇప్పటికే తమ పెట్టుబడులతో షాపులు ఏర్పాటు చేసుకుని జీవనోపాధి పొందుతున్న తమపై టోల్ ప్లాజా యాజమాన్యం మరోసారి ఆంక్షలు, బెదిరింపులకు పాల్పడుతోందని షాపుల యజమానులు ఆరోపిస్తున్నారు. గతంలో పోలీసుల సమక్షంలో కొన్ని దుకాణాలను తొలగించి నప్పటికీ, ప్రస్తుతం సరిహద్దు పరిధిని దాటకుండా ఉన్న షాపుల విషయం లోనూ యాజమాన్యం అభ్యంత రాలు వ్యక్తం చేస్తోందని వారు పేర్కొన్నారు.చిన్న వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించు కుంటున్న తమను రోడ్డుపైకి తీసుకురావద్దని, ఇప్పటికే పెట్టిన పెట్టుబడులు తిరిగి రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని షాపుల నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమపై బెదిరింపులకు పాల్పడుతూ జీవనోపాధికి ఆటంకం కలిగిస్తున్న వారిపై అధికారులు, పోలీసులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.ఈ సందర్భంగా పాశం కుమార్ మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారు ఉద్యోగాలు లేక బతుకుదెరువు కోసం చిన్నచిన్న షాపులు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారని తెలిపారు. సరిహద్దు నిబంధనలు పాటిస్తూ వ్యాపారం చేసుకుంటున్న వారిని ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. షాపుల యజమానులను బెదిరిస్తూ రోడ్డుపైకి తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తున్న వారిపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని పాశం కుమార్ డిమాండ్ చేశారు.

# అక్రమ అరెస్టులను ఖండించండి



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి ఆగష్టు 10 జనం సాక్షి** :రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏడో హామీ ప్రజాస్వామిక హక్కుల గ్యారెంటీని ఉల్లంఘించి సోమవారం ఎస్ కె ఎం  పిలుపుమేరకు జైల్ బరో నిర్వహిస్తున్న వామపక్ష పార్టీల నాయకులను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని మానవ హక్కుల వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి న్యాయవాది జి.రమేష్,భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐ ఎఫ్ టి యు) నగర అధ్యక్షులు దేవరాజు మల్లికార్జున్, ప్రగతిశీల యువజన సంఘం (పివైఎల్) జిల్లా అధ్యక్షులు వనమాల సత్యం, ప్రగతిశీల మహిళా సంఘం (గూఐె) నగర అధ్యక్ష కార్యదర్శులు నీలం లక్ష్మి, సంజన అన్నారు.సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్ కే యం) జాతీయ కమిటీ పిలుపుమేరకు వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు కట్టబెటే స్వేచ్ఛ వాణిజ్య  ఒప్పందాలకు వ్యతిరేకంగా, కార్మికుల పొట్ట కొట్టే నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో జైల్ బరో కార్యక్రమ పిలుపులో భాగంగా నిరసన వ్యక్తం చేస్తున్న వామపక్ష పార్టీల నాయకులను కార్యకర్త లను పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారు. ఒకవైపు కాంగ్రెస్ పార్టీ పెద్దలు నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా దేశ రాజధాని లో ఆందోళనలు నిరసనలు తెలుపు తున్నారు. అదేవిధంగా రైతుల కోసం కార్మికుల కోసం నిరసన తెలుపుతున్న వామపక్ష పార్టీ నాయకు లను అరెస్టు చేయడం రాష్ట్ర ప్రభుత్వం ద్వంధ్వ  విధానం అవలం బిస్తుంది అనడానికి నిదర్శనం అని  అన్నారు .ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన ప్రజా స్వామిక హక్కుల పునరు ద్ధరణ హామీని నిలబెటు ్టకోవాలని,రాజ్యాంగం ప్రసాదించిన నిరసన తెలిపే హక్కును అణిచివే యవద్దని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేస్తున్నాం అన్నారు.అరెస్టు చేసిన వామపక్ష నాయకులను బేషరతు  గా విడుదల చేయాలని ఏలాంటి అక్రమ కేసులు నమోదు చేయవద్దని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్న మోడీ ప్రభుత్వం



**గన్నేరువరం, ఆగస్టు 10 (జనంసాక్షి)**:కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశంలోని వివిధ రాష్ట్రాలను, ఆయా ప్రభు త్వాలను తమకబంద హస్తాల్లో పెట్టుకో వడానికి అనేక అడ్డదారులు తొక్కుతుందని, బెదిరింపులకు పాల్పడుతుందని, కార్పొరేట్ శక్తులకు నరేంద్ర మోడీ ప్రభుత్వం ఊడిగం చేస్తుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ ఆరోపించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగ ట్టేందుకు నిర్వహిస్తున్న సిపిఐ ప్రచార జాత ఐదవ రోజు గన్నేరువరం మండలంలో పర్యటిచ్చిందని, ఈ ప్రచార జాతా కార్యక్రమాలకు సిపిఐ గన్నేరువరం మండల కార్యదర్శి చొక్కల్ల శ్రీశైలం అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కలవేన శంకర్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం రైతు వ్యతిరేక చట్టాలని తీసుకువస్తే దేశంలోని రైతులంతా ఏకమై అనేక ఉద్యమాలు పోరాటాలు నిర్వహిం చారని, ఆ మహత్తర పోరాటంలో 750 మందికి పైగా రైతులు మృతి చెందారని, ఆ పోరాటాలకు తలొగ్గిన బిజెపి ప్రభుత్వం స్వయంగా ప్రధాని నరేంద్ర మోడీ రైతులకు క్షమాపణ చెప్పే దుస్థితికి బిజెపి పాలన దిగజారిందని, రైతుల కనీసం మద్దతు ధర చట్టం అమలు చేయడంలో వైఫల్యం చెందారని, నిరుద్యోగ యువకులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిం చడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, మహి ళలకు రక్షణ కరువైందని పోరాడి సాధించుకున్న మహిళా రిజర్వేషన్ అమలు చేయడం లేదని, కార్మిక హక్కులను చట్టాలను రద్దు చేస్తూ, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశాలను సైతం ప్రభుత్వం అమలు చేయక పోవడం సిగ్గుచేటన్నారు. జాతా లో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్,రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి,అందె స్వామి,జాతా కో ఆర్డినేటర్స్ కసిరెడ్డి సురేందర్ రెడ్డి, బోయిని అశోక్,గూడెం లక్ష్మీ,నాగెల్లి లక్ష్మారెడ్డి,సిపిఐ గన్నేరు వరం మండల కార్యదర్శి చొక్కాల్ల శ్రీశైలం, జిల్లా కౌన్సిల్ సభ్యులు కాంతాల అంజిరెరి,బీర్ల స్వాతి ,స్వప్న, విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



## దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తా : సురేష్

మల్లాపూర్, ఆగస్టు10 (జనంసాక్షి) : దేవాలయాల అభివృద్ధి కి కృషి చేస్తానని సురేష్ రెడ్డి సోమవారం మాట్లాడారు. దేవాలయాల అభివృద్ధి కమిటీ చైర్మన్గా ఎన్నికైన క్యాతం సురేష్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా గండికోట గంగ నరసయ్యలను సోమవారం ఎన్నుకున్నారు. మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్ ఆధ్వర్యంలో నూతన కమిటీని గ్రామ కుల సంఘ పెద్దమనుషుల ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అనంతరం సాల్వలతో సత్కరించి అభినందనలు తెలిపారు. మల్లాపూర్ లోని దేవాలయ అభివృద్ధికి కమిటీ సమిష్టిగా కృషి చేయాలని ఆలయ అభివృద్ధితోపాటు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గడ్డం సోమారెడ్డి, మాజీ చైర్మన్ సంఘం గంగ రాజం, నాయకులు ఏనుగు వెంకట్ రెడ్డి, కుల సంఘ పెద్దమనుషులు ఎగుర్ల కొమరయ్య, వెలుమల రాజారెడ్డి, చిప్ప శంకర్, తోట శాంతరాజం, నూతిపెల్లి రాజం ,డాక్టర్ స్వామి, నర్సారెడ్డి ,శ్రీపాద వెంకటాద్రి ,సత్యం, మురుపు గంగరాజ్యం, ఆశాలు, రాజేందర్ ,శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మల్యాల ఆగస్టు 10 (జనం సాక్షి) : నూకపల్లి డబుల్ బెడ్ రూమ్ కాలనీలో నివాసం ఉంటున్న మామిడిపల్లి సుమన్ మద్యానికి బానిసై భార్యతో తరచుగా గొడవ పడుతూ కొడుతుండేవాడని ఆగస్టు 9వ తేదీ సుమన్ తాగి వచ్చి భార్యను కొట్టగా కొడుకు సాయిచరణ్ తో కలిసి మేనమామ ఇంటికి టిఆర్ నగర్ కు వెళ్లిపోవడంతో మనస్తాపం చెంది రాత్రి ఇంట్లో తన బెడ్ రూమ్ లో నైలాన్ తాడుతో ఫ్యానుకు ఉరివేసుకొని చనిపోయాడని,ఆగస్టు 10వ తేదీ ఉదయం కాలనీకి చెందిన గంగా ప్రసాద్ ఫోన్ ద్వారా విషయం తెలిసిందని తెలిపాడని మృతుని కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

## ఎల్లారెడ్డిపేటలో 12న ఉచిత నేత్ర వైద్య శిబిరం



ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 10, (జనంసాక్షి) : ఎల్లారెడ్డిపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో ఈ నెల 12న ఉదయం 9:00 గంటల నుండి 1:30 గంటల వరకు ఎల్వి ప్రసాద్ కంటి ఆసుపత్రి, సిరిసిల్ల వారి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు గ్రామ సర్పంచ్ ఏ. నర్సింలు తెలిపారు. ఈ శిబిరంలో గ్రామ ప్రజలు, రైతులు మరియు అన్ని వర్గాల వారు పాల్గొని కంటి పరీక్షలు చేయించుకొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ముఖ్యంగా కంటి లోపల మోతిబిందు (క్యాటరాక్ట్), శుక్లాలు ఉన్నవారిని పరీక్షించి, అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శిబిరానికి వచ్చే వారు తప్పనిసరిగా ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్ తీసుకోవాలని సర్పంచ్ సూచించారు.

## బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ జడ్పిటిసి చీటి లక్ష్మణ్‌రావు



ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 10, (జనంసాక్షి) : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన ఉప్పుల నరసవ్వ అనారోగ్యంతో ఇటీవల మరణించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎల్లారెడ్డిపేట మాజీ జడ్పిటిసి, బిఆర్ఎస్ నాయకులు చీటి లక్ష్మణ్‌రావు, ఆయన సోదరుడు చీటి రామారావులు అనారోగ్యంతో మృతిచెందిన ఉప్పుల నరసవ్వ యొక్క భర్త ఉప్పుల నారాయణను వారి కుటుంబ సభ్యులను ఆదివారం పరామర్శించారు. వారి వెంట బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఉప్పుల రాజం, ఉప్పుల చిన్న రాజం, రాములు తదితులు పాల్గొన్నారు.

## స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలని రాస్తారోకో

గోదావరిఖని, జనంసాక్షి : క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఎస్‌కెఎం పిలుపులో భాగంగా 'జైల్ భరో' సందర్భంగా గోదావరిఖని 'మున్సిపల్ టీ-జంక్షన్' వద్ద రెండు గంటలపాటు కార్మిక రైతు సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్. వీరయ్య, ఐఎఫ్‌టీయు రాష్ట్ర నాయకులు ఈ. నరేష్, రైతు సంఘం నాయకులు గుమ్మడి వెంకన్న, ఎం. మల్లయ్య మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో వున్న బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూల, కార్మిక,రైతు,ప్రజా వ్యతిరేక విధానాలను మరింత వేగంగా అమలు చేస్తున్నదన్నారు.

# కిసాన్‌నగర్ ఘర్షణ కేసులో ఏడుగురు అరెస్ట్

### 29వ డివిజన్ కార్పొరేటర్ సోమిడి వేణు ప్రసాద్ కూడా నిందితుడే
### చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు : డీసీపీ వెంకటరమణ

కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 10 (జనంసాక్షి): కరీంనగర్ 3 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కిసాన్‌నగర్‌లో జరిగిన ఘర్షణ ఘటనకు సంబంధించి ఏడుగురు నిందితులను అరెస్టు చేసినట్లు డీసీపీ వెంకటరమణ తెలిపారు. ఈ నెల 9న రాత్రి సుమారు 10.30 గంటలకు క్లాసిఫికేషన్ వేపచెట్ల గ్రౌండ్ వద్ద ఘర్షణ జరిగినట్లు పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కరీంనగర్ 3 టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నంబర్ 274/2026 నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. ఈ కేసులో బీఎన్ఎస్ సెక్షన్లు 191(2), 191(3), 109(1) ఆర్/డబ్ల్యూ 190తో పాటు ఎస్సీ, ఎస్టీ (అట్రాసిటీస్ నిరోధక) సవరణ చట్టం–2015లోని సెక్షన్లు 3(1)(ఆర్), 3(1)(ఎస్), 3(2)(వీఏ), 3(2)(వీఐ) కింద కేసు నమోదు చేసినట్లు డీసీపీ వివరించారు.



**అరెస్టయిన నిందితులు:**
ఎ1 సోమిడి వేణు ప్రసాద్ (40), కిసాన్‌నగర్, 29వ డివిజన్ కార్పొరేటర్; ఎ2 కుడిద నాగేందర్ ఏ నాగేంద్రబాబు (31), బొమ్మకల్; ఎ3 పంతంగి మధు ఏ మధుకర్ (29), ఎ4 నెరెళ్ల నాగరాజు ఏ రాజు (32), ఎ5 శ్రీరామోజు భానుచందర్ ఏ భాను (30), ఎ6 సంగం వేణు @ చరణ్ (19), ఎ7 పంతంగి శశిధర్ @ చింటూ (28) కిసాన్‌నగర్, కరీంనగర్‌కు చెందిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించి, దర్యాప్తు అనంతరం నిందితులను చట్ట ప్రకారం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు డీసీపీ తెలిపారు. కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీసీపీ వెంకటరమణ స్పష్టం చేశారు.

# బహుముఖ ప్రజ్ఞతో కళ్యాణం శ్రీనివాస్‌కు గౌరవ డాక్టరేట్

### సాహిత్యం, చిత్రకళ, యానిమేషన్, ఏఐ రంగాల్లో విశేష సేవలు

కరీంనగర్ టౌన్, ఆగస్టు 10 (జనంసాక్షి): సాహిత్యం, చిత్రకళ, జర్నలిజం, కార్టూనింగ్, యానిమేషన్, కృత్రిమ మేధస్సు ఆధారిత సంగీతం, లఘుచిత్రాలు, చలనచిత్ర నిర్మాణం వంటి విభిన్న రంగాల్లో సేవలందిస్తున్న కరీంనగర్‌కు చెందిన కళ్యాణం శ్రీనివాస్ మరో అరుదైన ఘనత సాధించారు. తెలుగు సాహిత్యం, కళలు, యానిమేషన్, ఏఐ ఆధారిత సృజనాత్మక రంగాల్లో ఆయన సేవలను గుర్తిస్తూ ప్రపంచ సాధకుల మండలి, సౌత్ వెస్ట్రన్ అమెరికన్ విశ్వవిద్యాలయం సంయుక్తంగా గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశాయి. పదో తరగతి నుంచే కవిత్వం ప్రారంభించిన శ్రీనివాస్ ఇప్పటివరకు 200కు పైగా పుస్తకాలకు ముఖచిత్రాలు రూపొందించారు. ఈనాడు, ఆంధ్రప్రభ దినపత్రికల్లో పాత్రికేయుడిగా, రాజకీయ కార్టూనిస్టుగా




సేవలందించారు. 1996లో యానిమేషన్ శిక్షణ పూర్తి చేసి రెండు దశాబ్దాలకు పైగా యానిమేషన్ రంగంలో పనిచేశారు. ప్రస్తుతం ఏఐ ఆధారిత సంగీతం, దృశ్యాలు, లఘుచిత్రాలు, చలనచిత్ర నిర్మాణంపై పరిశోధనలు చేస్తున్నారు. 50కి పైగా తెలుగు పాటలకు సాహిత్యం అందించి ఏఐ ద్వారా సంగీతం, దృశ్యాలను రూపొందించారు. ఏఐ సాంకేతికతను తెలుగులో చేరువ చేసేందుకు అంతర్జాల వేదికను నిర్వహిస్తూ శిక్షణ అందిస్తున్నారు. 'వందే మాతరం' ఏఐ లఘుచిత్రాల పోటీలో రూపొందించిన చిత్రానికి కేంద్ర ప్రభుత్వం నుంచి అభినందన పత్రం అందుకున్నారు. ఆయనకు గౌరవ డాక్టరేట్ లభించడంపై సాహిత్య, కళా, సినీ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి.

### బొగ్గు గని కార్మికుల జీతాల పెంపునకు..
# 12వ వేజ్ బోర్డు ప్రక్రియను ప్రారంభించాలి

- సింగరేణి ఆర్‌జీ-వన్ జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదుట ధర్నా
- జీఎం లలిత్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చిన జాతీయ కార్మిక సంఘాలు

గోదావరిఖని, జనంసాక్షి : దేశంలో ఉన్న ప్రభుత్వ రంగ బొగ్గు గని కార్మికులకు జీతాల పెంపు కోసం 12వ వేతన సవరణ కమిటీ వెంటనే ఏర్పాటు చేయాలని, నాలుగు లేబర్ కోడ్‌లను బొగ్గు పరిశ్రమల్లో అమలు చేయరాదని డిమాండ్ చేస్తూ సింగరేణి ఆర్జీ-వన్ జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదుట జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించి యాజమాన్యంకు వినతిపత్రం ఇచ్చారు. ఈ ధర్నా కార్యక్రమంలో జాతీయ కార్మిక సంఘాల నాయకులు (ఏఐటియుసి) నుంచి కొరిమి రాజ్‌కుమార్, (ఎన్టీయుసి) నుంచి ధర్మపురి,(సిఐటియు) నుంచి ఎస్. వీరయ్య, (హెచ్ఎంఎస్)నుంచి దబ్బెట సతీష్ లు పాల్గొని ప్రసంగించారు. దేశంలో ఉన్న బొగ్గు గని కార్మికులకు జూన్ 30తో 11వ వేజ్ బోర్డు కాలపరిమితి ముగిసిందని, 2026 జూలై 1 నుంచి 12వ వేజ్ బోర్డు ప్రారంభం అయిందని, కానీ కోల్ ఇండియా యాజమాన్యం ఇంతవరకు వేజ్ బోర్డు ప్రక్రియను ప్రారంభించలేదని వారు ఆరోపించారు. గత కొన్ని నెలల క్రితం కోల్ ఇండియా యాజమాన్యంతో బొగ్గు గని కార్మిక సంఘాల తో జరిగిన సమావేశంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్ ల అమలు గురించి ప్రస్తావించారని, 51 శాతం ఓట్లు వచ్చిన కార్మిక సంఘంతో వేతన సవరణ జరుపుతామని తెలుపగా కేంద్ర కార్మిక సంఘాల




నాయకులు వ్యతిరేకించారని వారు పేర్కొన్నారు. గతంలో వలె 12వ వేజ్ బోర్డు ప్రక్రియను ప్రారంభించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ డిమాండ్ చేయగా కోల్ ఇండియా యాజమాన్యం కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేస్తామని తెలిపారని వారు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను బొగ్గు పరిశ్రమల్లో అమలు చేయరాదని,వెంటనే 12వ వేజ్ బోర్డు ప్రక్రియను ప్రారంభించేందుకు తక్షణమే కోల్ ఇండియా యాజమాన్యం,కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేనిచో కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చే ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని అవసరమైతే నిరవధిక సమ్మెకు పిలుపు నిస్తామని వారు హెచ్చరించారు. అనంతరం జాతీయ కార్మిక సంఘాల నాయకులు ఆర్జీ.వన్ జనరల్ మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఏఐటియుసి ఆర్జీ-వన్ బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను అధ్యక్షతన జరిగిన ధర్నా కార్యక్రమంలో జాతీయ కార్మిక సంఘాల నాయకులు మడ్డి ఎల్లాగౌడ్, తుమ్మల రాజిరెడ్డి, సదానందం, జాతీయ కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.